RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



18 జనవరి 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:195

## ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ను సందర్శించిన రేవంత్ రెడ్డి ,శ్రీధర్ బాబు






తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ను సందర్శించారు.

సింగపూర్ ఐటీఈలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి సహా 20 కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం పరిశీలించింది. ఆయా రంగాలలో పనిచేస్తున్న నిపుణులు, సిబ్బందితో ముఖ్యమంత్రి సంభాషించారు.

తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ పట్ల అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి ముందుకొచ్చిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, సెంట్రల్ కాలేజీతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది.

క్యాంపస్ పరిశీలన అనంతరం జరిగిన చర్చలు, సంప్రదింపుల మేరకు తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సంబంధించి ముఖ్యమంత్రి సమక్షంలో సింగపూర్ ఐటీఈ అధికారులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైఎస్ చాన్సలర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐటీఈ సింగపూర్ అకడమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్విందర్ సింగ్ , ఐటీఈ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించనుంది.



రాష్ట్రపతి భవన్‌లో జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డును అందుకున్న మన తెలంగాణ క్రీడారత్నం, వరంగల్ ముద్దుబిడ్డ, పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజి గారికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

తెలంగాణ నుంచి మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన స్పోర్ట్స్ పాలసీతో ప్రజా ప్రభుత్వం ముందుకుపోతున్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

## రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి విస్తృత చర్చలు





తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తలపెట్టిన రెండు దేశాల పర్యటన శుభారంభమైంది. ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కూడిన బృందం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియాన్ బాలకృష్ణన్ తో విస్తృత చర్చలు జరిపింది.

మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇంధనం, స్థిరమైన హరిత ఇంధనం, నీటి నిర్వహణ, నదుల పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, IT పార్కులు తదితర అంశాల్లో విస్తృత సహకారం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. సింగపూర్ పర్యటన అనంతరం స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటారు.





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి రాక సందర్భంగా సింగపూర్ లో నివసిస్తున్న తెలంగాణకు చెందిన వారితో విమానాశ్రయంలో సందడి నెలకొంది. మంత్రి శ్రీధర్ బాబు గారితో కలిసి సింగపూర్ చేరుకోగానే అక్కడి తెలంగాణ పౌరులు కొందరు ముఖ్యమంత్రి గారి దగ్గరకు వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి సీతక్క.



**ప్రజా బలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ పథకాల అమలుపై ఉమ్మడి జిల్లా స్థాయి ప్రణాళిక కార్యాచరణ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అభిలాష అభినవ్, రాజార్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విట్టల్, శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావ్ పటేల్, పాయల శంకర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రికి జిల్లా కలెక్టర్ పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా పథకాలను పగడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

జనవరి 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, సంబందిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లబ్దిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందజేసే భాద్యత అధికారులదేనన్నారు. రైతుభరోసా పథకానికి సంబందించి సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ సభలు,పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలను వెల్లడించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.అలాగే ఉమ్మడి జిల్లాలో నిరుపేదలందరికీ మెరుగైన విద్య, వైద్యం,త్రాగునీరు, విద్యుత్,రోడ్డు సౌకర్యం,తదితర వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇటీవలే నిర్మల్ ఉత్సవాలను విజయంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ కు, అధికారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,జిల్లాలో నూతన పథకాల అమలుకోసం అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతామని,జిల్లాలో నూతన రేషన్ కార్డుల కోసం 17491 దరఖాస్తులు వచ్చాయని, సర్వే ద్వారా ఇప్పటివరకు 2924 మంది అర్హులను గుర్తించనట్లు తెలిపారు. దీనికి సంబందించి సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్దిదారుల వివరాలు గ్రామ, వార్డు సభలను నిర్వహించి గ్రామ సభల ఆమోదంతో సమగ్ర జాబితాను సిద్దం చేస్తామని తెలిపారు.

ఆ తర్వాత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మట్లాడుతూ, కొత్త రేషన్ కార్డుల మంజూరూ, రైతు భరోసా,రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో లబ్దిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు.

ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ఏజెన్సీ ప్రాంతాల నిరుపేదలకు న్యాయం జరగాలని కోరారు. క్షేత్రస్థాయి సర్వేలో నిరుపేదలను గుర్తించి వారికి పథకాలను అమలు చేయాలన్నారు.

అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను మంత్రి సీతక్క, కలెక్టర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్,అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, కుష్బూ గుప్తా ( ఐటిడిఒ పిఓ), శ్యామలా దేవి,దీపక్ తివారి, శాసనసభ్యులు రామారావ్ పటేల్, పాయల శంకర్, అనిల్ జాదవ్ లు,మున్సిపల్ చైర్మెన్లు గండ్రత్ ఈశ్వర్, మేడిపల్లి సత్యం,గ్రంథాలయ చైర్మెన్ సయ్యద్ అర్జుమంద్ అలి, మార్కెట్ కమిటీ చైర్మెన్లు ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశంలో పేలిన స్టార్‌షిప్ రాకెట్

వార్తా 5 లో

ప్రజాబలం

18 జనవరి 2025 శనివారం

## నటపరిపాలనా సార్వభౌముడు ఎన్‌టిఆర్

తెలుగువారు "అన్నగారు" అని అభిమానంతో, ప్రేమతో, ముద్దుగా పిలుచుకునే నందమూరి తారక రామారావు, అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటనకే పరిమితం కాక, పలు చిత్రాలను నిర్మించి, మరి ఎన్నింటికో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షాన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలుగా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగు భాషకు, తెలుగు జాతికి, దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి, అఖిలాంధ్ర అందాల నటుడు నందమూరి తారక రాముడు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. ఎన్టీఆర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సుయోధనుడు రావణుని వంటి పౌరాణిక పాత్రల తో బాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించారు. సాటిలేని మేటిగా "చిత్రసీమ రారాజుగా భాసిల్లిన స్థితప్రజ్ఞులు రామారావు, 44 ఏళ్ల సినీ ప్రస్థానంలో, 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమిదేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. 1923 మే న కృష్ణాజిల్లా పామూరు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించి, తారక రాముని"గా నామాంకితులై, విజయవాడ మున్సిపల్ స్కూల్లో, తర్వాత ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో చదివారు. "కవి సామ్రాట్" విశ్వనాథ సత్య నారాయణ తెలుగు భాష ఉపాధ్యాయునిగా రామారావుకు "ఆడ వేషం" వేసే అవకాశం కల్పిస్తే, మీసాలు తీయకనే నటించి, "మీసాల నాగమ్మ" పిలువ బడ్డారు. విద్యాభ్యాస సమయంలో ఆస్తి హరించుకు పోగా, కొద్ది రోజులు పాల వ్యాపారం, కిరాణా షాపు, ఒక ముద్రణాలయాన్ని నడిపారు. 1942 లో మేనరికంగా బసవ తారకంను వివాహ మాడారు. నాటి ప్రఖ్యాత నటులు "కొంగర జగ్గయ్య, రక్త కన్నీరు నాగభూషణం, కె.వి.ఎస్. ముక్కామల" లాంటి నటులతో "నేషనల్ ఆర్ట్ థియేటర్" నాటక సంస్థను స్థాపించారు. తర్వాత కాలంలో సదరు సంస్థ కొన్ని చిత్రాలు కూడా తీసింది. జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ మోహన కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ, కుమారులు కాగా, పురంధరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి కూతుళ్ళు కలిగారు. 1947లో పట్టభద్రులై మద్రాసు సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి 1100 మందికి, ఏడుగురిలో ఎంపికై సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం పొంది, తన కార్యక్షేత్రం సినీ రంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ సినీ నిర్మాత బి.ఎ.సుబ్బారావు రామారావును మద్రాసు పిలిపించి, "పల్లెటూరి పిల్ల" చిత్రంలో కథానాయకుడి పాత్రను 116 రూపాయల పారితోషకం అందించారు. అయితే 1949 లో విడుదలైన "మన దేశం" ఎన్టీఆర్ కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రం అయింది. తర్వాత దర్శకుడు యోగానంద్ కలిసి మద్రాసులో చిన్న గదికి మకాం మార్చారు. 1951లో నటించిన, నాటికీ నేటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన పాతాళభైరవి" చిత్రం. 10 కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకుంది. 1956 లో లిమాయాబజార్' చిత్రానికి ఎన్టీఆర్ తీసుకున్న 7500 రూపాయల పారితోషికం నాడు అత్యధికం. తర్వాత భూకైలాస్" "వెంకటేశ్వర మహత్యం" భారీ విజయాలు సాధించగా, "శ్రీమద్విరాటపర్వం"లో ఐదు పాత్రలు పోషించి ఔరా అనిపించు కున్నారు.1952 నుండి ఎన్టీఆర్ పారితోషికం లక్షల్లోకి చేరింది. "లవకుశ", "సీతారామ కళ్యాణం", "దాన వీర శూర కర్ణ", "నర్తనశాల", "విశ్వామిత్ర" లాంటి చిత్ర రాజాలు, ఆయన నటనకు కలికి తురాయిలుగా నిలిచాయి. "న భూతో న భవిష్యతి" అనిపించాయి. "అడవి రాముడు" "యమగోల" బాక్సాఫీసు విజయాలు సాధించాయి. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ "ప్రజా సేవ" వైపు తమ దృష్టిని మరల్చారు. 1978లో రాష్ట్ర కాంగ్రెస్ లో కుమ్ము లాటలు, ఐదేళ్లలో 4గురు సీఎంలు మారడం, ఢిల్లీలో అధిష్టాన నిర్ణయానుసారం, సీఎంలు ఎన్నుకోబడిన సాంప్రదాయం, కాంగ్రెసు ప్రతిష్టను దిగజార్చడం జరిగింది. ఈ క్రమంలోనే 1982 మార్చి 21న హైదరాబాద్ కు చేరి, మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించ నున్నట్లు ప్రకటించి, "తెలుగుదేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెట్" కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావాలను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌరవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయాసంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. టిడిపి వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్ రావు, 1986 ఆగస్టు 16న, నాటి దేశ ప్రధాని ఇందిర, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రాంలాల్ సహకారంతో, ఎన్టీఆర్ ను పదవీచ్యుతుని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ ఫలితంగా, సెప్టెంబర్ 16న తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయినారు. ఎన్టీఆర్ ఎందరో ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాజకీయ జీవితాలను ప్రసాదించారు. విడిపోయిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా బాబునాయుడు, దివంగత ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసిన వారే కావడం విశేషం. 1985 జూన్ 1న శాసన మండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్ధుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989 లో మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక పాత్ర, రెండు రూపాయల కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్య నిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా 1991 నంద్యాలలో గౌరవ సూచకంగా, నాటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు పోటీ పెట్టక పోవడం, 1989... 1994 మధ్య ప్రతిపక్ష పార్టీ నేతగా వ్యవహరించడం, 1993లో లక్ష్మీపార్వతిని వివాహ మాడటం, ఆమె సహచర్యం, తారకరాముని రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి.

# బ్యాంకులు,ఎ టి ఎమ్ ల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

## ప్రతి బ్యాంక్ ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డ్స్,సిసి కెమెరాలు,అలారం సిస్టం ఏర్పాటు చేయాలి

## పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజి ఎం.శ్రీనివాస్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 17 : బ్యాంకు అధికారులు సిబ్బంది,పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను నియంత్రించవచ్చని రామగుండము పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సిపి పోలీసు కార్యాలయంలో కమీషనరేట్ పరిధి పెద్దపల్లి,మంచిర్యాల జోన్ వ్యాప్తంగా ఉన్న ఎసిపి లు వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు అధికారులతో బ్యాంకుల, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు,సిసి కెమెరాల ఏర్పాటు,ఆర్థిక నేరాలు, గతంలో రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధి లో జరిగిన బ్యాంకు మరియు ఏటీఎం సంబందించిన నేరాల గురించి, భవిష్యత్తు లో తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లు,తీసుకోవలసిన జాగ్రత్తలపై, తదితర అంశాలపై సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ...రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ లో 109 బ్యాంకు లు, 79 ఏటీఎం సెంటర్స్ ,మంచిర్యాల జోన్ పరిధిలో 109 బ్యాంకు లు, 89 ఏటీఎం సెంటర్స్ లను గుర్తించడం జరిందని అన్నారు. బ్యాంకులు,ఎటిఎంల వద్ద పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తూచ తప్పకుండా పాటించాలని, ఎటిఎం కేంద్రాల వద్ద కచ్చితంగా గార్డును నియమించాలని సిపి గారు ఆదేశించారు.నిరంతరం సెక్యూరిటీ గార్డ్స్,సిసి కెమెరాలు,అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.రామగుండము కమీషనరేట్ పోలీసులు నిర్వహించిన ఆడిట్‌లో దాదాపు బ్యాంకులు, టీఎంలలో అధిక నాణ్యత లేని సీసీ కెమెరాలు ఉన్నాయని,చాలా బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరని ఈ సమావేశం అనంతరం అన్ని ఎటిఎంలలో,బ్యాంకులలో అలారం సిస్టమ్‌లతో పాటు సిసిటివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు

సెక్యూరిటీని నియమించాలని,దోపిడీ సమయంలో సిబ్బంది ఎలా ప్రతిస్పందించాలో దానిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.లోపలికి వచ్చే వ్యక్తులను తనిఖీ చేయడానికి డ్యూటీలో ఉన్న గార్డుకు బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద ఒక %ణఖీవీణ% (డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్)ను ఏర్పాటు %ఎఎవీణ% (హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్) అందించాలి.

సెక్యూరిటీ గార్డును బ్యాంక్ లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ,అతని వ్యక్తిగత సమాచారం యొక్క పూర్తి రికార్డు,అతని ఫోటోతో పాటు,బ్యాంక్ వద్ద ఉంచాలి.

కొత్తగా నియమితులైన వారు లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన వారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండండి.చాలా నేరాలలో నిందితులు సీసీటీవీ లపై స్ప్రే చేసి సిసిటివిలు పని చేకుండా చేసి దొంగాతలకు పాల్పడుతారు అదేవిధంగా %ణఎ=% లను దొంగిలించి నాశనం చేయడం చేస్తారు కావున %ణఎ=% లను కనిపించేలాగా కాకుండా సీక్రెట్ ప్రాంతాలలో దాచాలి.

అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్‌లో భాగమైన నిజమైన కస్టమర్‌లు మరియు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి మరియు ఆయుదాలు ఉపయోగం పై సెక్యూరిటీ గార్డులకు శిక్షణ ఇవ్వాలని,సెక్యూరిటీ గార్డ్, బ్యాంకు లోపల మరియు బయట పరిసరాలను, వ్యక్తులను వారి కదలికలు,ప్రవర్తనలను గమనిస్తూ ఉండాలి. బ్యాంక్ అధికారులను కూడా ఆదేశించారు.ఏటీఏమ్ లో డబ్బులు ఫీల్లింగ్ సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలోని బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు.ప్రతి బ్యాంకు అధికారులకు, సిబ్బందికి బ్యాంకు ఉన్న ప్రాంత పోలీస్ స్టేషన్ అధికారుల నెంబర్ లు తెలిసి ఉండాలి.హెల్ప్‌లైన్ మరియు పోలీస్ స్టేషన్‌ల సంప్రదింపు నంబర్‌లను బోల్డ్ అక్షరాలతో వ్రాసి బ్యాంకు లోపల తగిన ప్రదేశాలలో ఉంచాలి,తద్వారా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు అవి సులభంగా కనిపిస్తాయి. ఇప్పటివరకు,దొంగలు ఎక్కువగా బ్యాంకులను రోజుకి తెరిచినప్పుడు లేదా మూసివేయబడిన సమయంలో మరియు వారి భోజన విరామ సమయంలో కూడా లక్ష్యంగా చేసుకున్నారు.కాబట్టి ఈ సమయంలో సెక్యూరిటీ గార్డుతో పాటు బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ప్రమాదకరమైన సంఘటన జరిగినప్పుడు డయల్ 100 కు,స్థానిక పోలీస్ కి సమాచారం ఉంచాలి.పని వేళల్లో మరియు తర్వాత బ్యాంకు ఆవరణలో కూర్చోవడానికి బదులు, బయట ప్రధాన ద్వారం వద్ద ఉండి అప్రమత్తంగా విదులు నిర్వహించాలి బ్యాంకు సమయం తరువాత బ్యాంకు ను పూర్తిగా డోర్స్ క్లోజ్ చేసి పని చేసుకోవాలి.

బ్యాంకుల నుండి బంగారం, డబ్బులు డ్రా చేసుకొని వెళ్ళే వాళ్ళను లక్ష్యంగా చేసుకుని,వారిని అనుసరించి వారిని దోచుకుంటారు. బ్యాంకు బయట వాహనాలు నిలిపే ప్రాంతాలలో కూడా సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలి.రాత్రి సమయం లో కూడా సెక్యూరిటీ గార్డ్స్ లను ఆకస్మికంగా వారి పనితీరు ను తనిఖీ చేయాలని సూచించారు.ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు,కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు,ఎ ఆర్ ఏసీపీ లు ప్రతాప్,సిసిఆర్బి ఇన్స్పెక్టర్ సతీష్,ఐటీ అండ్ కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్,ఆర్ఐ దామోదర్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారుు

# మరింత బాధ్యతతో పని చేస్తా

## జిల్లా ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ అంకతి శ్రీనివాస్

## పార్టీని నమ్ముకున్న కార్యకర్తకు తగిన గుర్తింపు




ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 17 : మరింత బాధ్యతతో కష్టపడి పని చేస్తానని జిల్లా ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ అంకతి శ్రీనివాస్ అన్నారు.తనను నమ్ముకొని కష్ట కాలంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఇచ్చిన మాటను నేడు రుజువు చేశారు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన మండల మాజీ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకతి శ్రీనివాస్ ను మంచిర్యాల జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ గా నియమించారు.ఎమ్మెల్యే నివాసంలో అంకతి శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించి నియమక పత్రాన్ని అందజేశారు.అనంతరం అంకతి శ్రీనివాస్ మాట్లాడుతూ... తనను నమ్మి తనకు ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే కు ముందుగా ధన్యవాదాలు తెలిపారు.మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ అన్న కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్న అలాగే వారు చేసే సేవ కార్యక్రమాలన్న చాలా అభిమానమని అన్నారు.నమ్ముకున్న కార్యకర్తల కోసం దేనికైనా వెనుకాడడని,అలాగే కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఏదో విధంగా తగిన గుర్తింపుతో పాటు తన వంతు సహాయ సహకారాలు అందజేసే గుణం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుదని వారి సేవలను కొనియాడారు.

# ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తాం: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్ జనవరి 17 ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు . ప్రజల దృష్టిని మళ్లించడానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ పోరాటం చేయడంతోనే కాంగ్రెస్ రైతుభరోసా ఇచ్చిందని చెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చురకలంటించారు. అందుకే బిఆర్ఎస్ నేతలు రైతు దీక్ష చేపట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడుతోందని స్పష్టం చేసారు.

# మధ్యవర్తిత్వానికి న్యాయవాదుల నియామకం



**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** కుటుంబ తగాదాలలో రాజీమార్గంతో కేసులు సత్వరం పరిష్కారం అయ్యేం దుకు న్యాయవాదులు తుమ్మనపెల్లి లక్ష్మన్ రావు, శ్రీరాముల కిషన్, పెరుక రంగయ్య ను నియమించారు. ఈ మేరకు ముగ్గురు న్యాయవాదులు మీడి యేషన్లో శిక్షణ పొందారు. శుక్రవారము కరీంనగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ ని న్యాయవాదులు కలిసి శిక్షణ వివరాలను వెల్లడిం చారు. సుప్రీంకోర్టు ఆదేశా లతో తెలంగాణ హైకోర్టు మీడియేషన్ ఆర్బిట్రేషన్ కేంద్రం ద్వారా హైదరాబా ద్లో ఐదురోజుల శిక్షణ తీసు కుని ఆమేరకు ధ్రువపత్రం అందుకున్నట్టు వివరించారు. కుటుంబ తగాదాలు, వివాదా లలో రాజీమార్గంలో ప్రయత్నించి కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా కృషిచేయాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారని వారు వివరించారు.

# హిందీ సాహిత్య దిగ్గజం

డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ ( 1907 నవంబరు 27 – 2003 జనవరి 18) 20 వ శతాబ్దం ప్రారంభంలో హిందీ సాహిత్యంలోని నయీ కవితా సాహిత్య ఉద్యమం లోని భారతీయ కవి. హిందీ సాహిత్యంలో సాటిలేని వారసత్వా న్ని మిగిల్చిన సాహిత్య దిగ్గజం ఆయన. 20వ శతాబ్దపు ఛాయా వాద ఉద్యమం మార్గదర్శకునిగా పరిగణించబడే హరివంశ్ రాయ్ బచ్చన్ గురించి ప్రస్తావించ కుండా హిందీ సాహిత్యం గురించి ప్రస్తావిం చడం సాధ్యం కాదు. 60 సంవత్స రాల పాటు సాగిన సాహిత్య జీవితంతో, బచ్చన్ 30కి పైగా కవితలు రాశారు. ప్రతి ఒక్కటి శక్తివంతమైన చిత్రాలతో, సమ కాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉన్నాయి. హరివంశ్ రాయ్ బచ్చన్ బ్రిటిష్ ఇండియా లోని యునైటెడ్ ప్రావి న్సెస్ ఆఫ్ ఆగ్రా లోని ప్రతాప్ గఢ్ జిల్లాకు చెందిన బాబు పట్టి గ్రామం లో కాయస్థ కులంలోని శ్రీవాస్తవ వంశానికి చెందిన అవధి భారతీయ హిందూ కుటుంబంలో నవంబర్ 27, 1907న జన్మించారు. ఆయన ముందు శ్యామాను వివాహం చేసుకోగా, ఆమె త్వరగా మరణించడంతో మళ్లీ తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. అనేక ప్రసిద్ధ కవితలు వ్రాసారు. సిల్సిలా (1981), ఆలాప్ (1977) మరియు ఫిర్ భీ (1972) అనే బాలీవుడ్ చిత్రాలలో గీత రచయి తగా కూడా పనిచేశారు. 1941 నుండి 1957 వరకు, అలహా బాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా బోధించారు. ఆ తరువాత రెండు సంవత్స రాలు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన సెయింట్ కాథరీన్ కళా శాలలో ప్రఖ్యాత ఐరిష్ రచయిత డబ్ల్యూ.బి.యీట్స్ రచనలపై పి.హెచ్.డి చేసారు. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో పి హెచ్ డి చేసిన మొదటి భారతీయునిగా గుర్తింపు పొందారు. హరివంశ్ రాయ్ హిందీ కవిత్వం రాసేటప్పుడు సాధారణంగా సాంప్ర దాయంగా ఉపయోగించే శ్రీవాస్తవ వంశ పేరుకు బదులుగా “బచ్చన్” (బాలుడు) అనే కలం పేరును ఉపయో గించారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత, అలహాబాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం బోధించారు. అలహా బాద్‌లోని ఆల్ ఇండియా రేడియోలో కూడా పని చేశారు. బచ్చన్ అనేక హిందీ భాషలలో (హిందూస్థానీ, అవధి) నిష్ణాతులు. దేవనాగరి లిపిలో రాసిన కవితల్లో హిందూస్థానీ పదజాలం విస్తృతంగా వాడారు. ఒమర్ ఖయ్యామ్ చేత పర్షియన్, ఉర్దూ కవిత్వం పట్ల ప్రభావితమయ్యారు. బచ్చన్ తన ప్రారంభ రచన మధుశాల ద్వారా అనూహ్య గుర్తింపు పొందారు. సామాన్యుడి దృక్కోణంలో రాసిన ఆయన కవితలు దేశంలోని అసంఖ్యాక సామాన్యులకు స్వరం వినిపిం చాయి. బచ్చన్ కవిత్వం స్వేచ్ఛ కోసం సామాన్యుని కోరిక, జీవితం, మరణం, ప్రేమ, వాంఛ మొదలైన అనేక ఇతి వృత్తాలతో ముడి పడి ఉంది. హరివంశ్ రాయ్ అనేక కవితలు ఆయన వ్యక్తిగత జీవితం, విషాదాల నుండి ప్రేరణ పొందాయి. బచ్చన్ రచించిన చాలా కవితలలో ప్రేమికుడి వేదన ప్రధానమైన ఇతివృత్తాలలో ఒకటిగా నిలిచింది. మధుశాల అనేది 135 పద్యాల కవిత్వం, ఇది హరివంశరాయ్ బచ్చన్‌ను ఎనలేని గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆంగ్లం, మలయాళం, బెంగాలీ మరియు మరాఠీలోకి అనువదించ బడింది. హరివంశ్ రాయ్ బచ్చన్ రచించిన అత్యంత ప్రజాదరణ పొందిన కవితలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే వారికి ప్రేరణగా బచ్చన్ అగ్నిపథ్’ అనే కవితను రాశారు. 1969లో సాహిత్య అకాడమీ అవార్డుతో బచ్చన్ ను సత్కరించారు. 1976 లో హిందీ సాహిత్యానికి చేసిన సేవకు గాను పద్మ భూషణ్ పురస్కారాన్ని అందు కున్నారు. ఆయన భార్య తేజీ బచ్చన్ సామాజిక కార్యకర్త. హరివంశ్ రాయ్ కుమారుడు, మనుమడు పరిచయం అక్కరలేని ప్రఖ్యాత హిందీ నటులు అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్. హిందీ సాహిత్యంలో తనదంటు ప్రత్యేక ముద్ర వేసుకున్న బచ్చన్ దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై, 2003 జనవరి 18న తనువు చాలించారు.

# సిఎం అభ్యర్థిలేని ఢిల్లీ ఎన్నికలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బహుశా తొలిసారిగా, ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రజల ముందు ఉంచలేని పరిస్థితుల్లో జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికార పార్టీకి ఎదురులేని నాయకుడైనప్పటికీ చట్టపరమైన చిక్కుల కారణంగా వారు ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పలేకపోతున్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ దేశ రాజధానిలో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడానికి ప్రజాదరణ పొందిన లేదా బలమైన నాయకుడే లేరు. స్థానిక నాయకత్వం లేకపోవడంతో, వారు ఓటర్లను ఆకర్షించడానికి బయటి నుండి ‘దిగుమతి చేసుకున్న’ నాయకులు లేదా తమ హైకమాండ్‌లపై ఆధారపడుతున్నారు. మాజీ ఐపిఎస్ అధికారిణి కిరణ్ బేడిని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడం ద్వారా బిజెపి గతంలో ఒకసారి తప్పటడుగు వేసింది. ఓటర్లను లేదా బిజెపి కేడర్‌ను కూడా ఆమె ఉత్సాహపరచడంలో విఫలమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆమె పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎన్నికల తర్వాత, ఆమె ప్రజాజీవితంలో ఎక్కడా కనిపించలేదు. అరవింద్ కేజ్రీవాల్ అధికార ఆప్‌కి కిరీటం లేని నాయకుడు కావడంతో సాధారణంగా అందరూ ఆ పార్టీ ముఖ్యమంత్రిగా భావిస్తున్నప్పటికీ ఆయన చట్టపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన అధికారిక ఫైళ్లపై సంతకం చేయలేరు లేదా సిఎం కార్యాలయంలోకి ప్రవేశింపలేరు. దానితో ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆప్ చెప్పలేకపోతున్నది. దానితో బిజెపి మార్గంలో ఆప్ కేజ్రీవాల్, సిఎం ఆతిశీ అనే డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రస్తావిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందుగానే తన అభ్యర్థులందరినీ ప్రకటించడం ద్వారా ఆప్ సౌకర్యవంతమైన స్థితిలో ఉండగా, అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ చివరి వరకు తికమకపడుతున్నాయి. అంతర్గత కలహాలు, బలమైన అభ్యర్థులను గుర్తించడంలో అనిశ్చితి వారి ఎంపికలను కష్టతరం చేశాయి. మొదట్లో, బిజెపి మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని సిఎం అభ్యర్థి కాబోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల బలమైన వ్యూహాత్మక నిర్వహణతో హర్యానా, మహారాష్ట్రాలలో గొప్ప ప్రయోజనం పొందిన తర్వాత, బిజెపి ఇప్పుడు సొంతంగా సిఎం అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతోంది.

26 ఏళ్లుగా ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంటూ వస్తున్న బిజెపి ఈసారి ఎట్లాగైనా అధికారం చేపట్టాలని పట్టుదలగా ఉంది. పదేళ్ల ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రభుత్వ వ్యతిరేకత అందుకు అనుకూలం కాగలదని ఆశిస్తున్నది. మొహల్లా క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో కొంతమేరకు కేజ్రీవాల్ దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి సాధింపలేని పాలనా విజయాలు సాధించినా గెలుపుకోసం అవి మాత్రమే సరిపోవు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన, అపరిశుభ్రమైన దేశరాజధానిగా నేడు ఢిల్లీ అప్రతిష్ఠకు గురవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి ‘వికసిత్ భారత్’గా అభివృద్ధి చెందినా ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయంగా భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటుచూసినా కనిపించే వ్యర్థపదార్థాలు, ఇవికాకుండా కాలుష్యం..ఇవన్నీ కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, వైఫల్యాలు ప్రజల ముందు నిలుస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజ్రీవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులు అనేకమంది వెళ్లడం కూడా ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఆ కేసులు అన్ని రాజకీయ కక్షసాధింపుగా నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు ఏవీ న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు లేకపోయినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెనుసవాల్‌ను ఇప్పుడు ఆయన ఎదుర్కొంటున్నారు. మరోవంక, సైతం బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడంతో 2014 నుండి వరుసగా మొత్తం 7 లోక్‌సభ సీట్లను గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతుంది. కానీ ఆప్ మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో మొదటిసారిగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. ‘శేష్ మహల్’ గురించి కొంతమేరకు కేజ్రీవాల్‌ను ఇరకాటంలో పడవేసిన బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి అద్భుతమైన ప్రచారాలు వివరాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బిజెపి తమ ప్రచారాన్ని మార్చివేశారు.

వారు కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలను ‘ద్వేషిస్తున్నాడని’ ఆరోపించడంపై దృష్టి సారించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి తీసుకువచ్చిన నమోదిత ఓటర్లలో అకస్మాత్తుగా, వివరించలేని పెరుగుదల ఉందని ఆప్ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడాన్ని వారు ఈ విధంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక దుష్ప్రచారంతో ఆప్‌ను ఆత్మరక్షణలో పడవేసే ప్రయత్నం కాకుండా నేరుగా ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా బిజెపి ప్రచారం చేయలేకపోతున్నారు. చివరకు ప్రధాన మంత్రి సైతం వ్యక్తిగత విమర్శలతో కేజ్రీవాల్ ప్రభావం ప్రజలపై తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. అంతేగాని, ఢిల్లీ రూపురేఖలను తాము ఏ విధంగా మార్చగలమో చెప్పే ప్రయత్నం చేయడం లేదు. గతంలో యుపిఎ హయాంలో ఢిల్లీకి ఇతర రాష్ట్రాల మాదిరిగా పూర్తి రాష్ట్రస్థాయి అధికారాలు ఇవ్వాలని ఆందోళనలు జరిపిన బిజెపి గత పదేళ్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారాలను గణనీయంగా తగ్గించి వేసింది. పేరుకు రాష్ట్ర ప్రభుత్వమే అయినప్పటికీ ఓ మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఢిల్లీ ప్రభుత్వాన్ని కేంద్రంలోని బిజెపి మార్చివేసింది. మరోవంక జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని స్వయంగా ప్రధాని మోడీ హామీ ఇచ్చి ఏళ్ళుగడుస్తున్నా ఆ దిశలో ఎటువంటి చర్యలకు పాల్పడటం లేదు. దానితో ఢిల్లీ ప్రభుత్వంలో గణనీయ మార్పులను తీసుకురాగలమనే భరోసాను ప్రజలలో బిజెపి కలిగించలేకపోతున్నది. ఢిల్లీ తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న సమయంలో పొరుగున ఉన్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేకపోయింది. ఢిల్లీలోని దళితుల మద్దతు పొందటం బిజెపికి ఓ సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అంబేద్కర్‌పై ఇటీవల రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడిన విధానం ఈ పార్టీ పట్ల దళిత వర్గాలలో ప్రతికూల సంకేతాలు వ్యాపించేందుకు దోహదపడుతున్నాయి.

ఈ క్రమంలో 12 ఎస్‌సి రిజర్వుడ్ సీట్లు, మెజారిటీ దళిత ఓట్లు ఉన్న 30 నియోజకవర్గాలపై దృష్టి సారించింది. 2015, 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో 12 ఎస్‌సి రిజర్వుడ్ నియోజకవర్గాలలో బిజెపి ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. అంతకుముందు జరిగిన ఎన్నికల్లోనూ 2–3 సీట్లతోనే సరిపెట్టుకుంది. దళితుల ప్రాబల్యం గల నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నప్పటికీ బిజెపి ఏమాత్రం వారిని ఆకట్టుకోగలదో చూడాల్సి ఉంది. వాస్తవానికి కేజ్రీవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ బిజెపిలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు బిజెపి వెనకాడుతుంది. పైగా పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే గెలుపొంది, ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, ప్రజాదరణతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తున్న బిజెపి ఢిల్లీలో సైతం కేవలం ప్రధాని మోడీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతుంది. అయితే గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ఓటర్లను ఆకర్షించడంతో మోడీకి సైతం పరిమితులున్నాయని స్పష్టం కావడం బిజెపికి ప్రమాద సంకేతాలను సూచిస్తున్నది. ముఖ్యంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం వంటి అంశాలు బిజెపి నుండి యువతను, మధ్యతరగతి ప్రజలను దూరం చేస్తుంది. అందుకనే ఢిల్లీ ఎన్నికలు బిజెపి నాయకత్వంపై అగ్నిపరీక్షగా మారాయి. ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజ్రీవాల్, అఖిలేష్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుంది. బిజెపికి సైతం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కాకుండా మరో నాయకుడు మోడీకి పోటీగా ఎదగడం ఇష్టం లేదు. అందుకనే కేజ్రీవాల్‌ను ఓడించడం ఆ పార్టీకి చాలా అవసరంగా ఉంది. ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓ రకంగా ఏకాకిగా పోటీ చేస్తున్నది. ప్రతిపక్షాలు ఆప్ పట్ల సానుకూలత వ్యక్తం చేయడం రాబోయే రోజులలో జాతీయ స్థాయిలో ఆ పార్టీ మరింత ఏకాకిగా మారే సంకేతాలను అందిస్తున్నది.

# డిటెన్షన్ విధానం మంచిదే కానీ..!

సమర్థ మానవ వనరుల నిర్మాణానికి విద్య అత్యంత కీలకమైనది. అందరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్య సాధనలో విద్యాహక్కు చట్టం 2009ను తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతున్నది. విద్యను సార్వత్రికం చేయడంలో ఈ చట్టం విజయవంతమైందని చెప్పవచ్చు. నేడు మెజారిటీ విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని అసర్ సర్వే, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యా నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వాస్తవంగా మొదట్లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 ప్రకారం నో– డిటెన్షన్ విధానం ఉండేది. ఈ సెక్షన్ రెండు కీలకమైన నిబంధనలను నిర్దేశిస్తుంది. మొదటిది, ప్రాథమిక విద్యను పొందుతున్న ఏ పిల్లవాడినీ పాఠశాలనుంచి బహిష్కరించకూడదు. రెండవది, ఏ తరగతిలోనూ పిల్లలను నిలుపుదల చేయకూడదు. అనగా 8వ తరగతి వరకు విద్యార్థులను నిర్బంధించకుండా పైతరగతులకు అనుమతించాలి. పిల్లలు ప్రతి తరగతిలో ఫెయిల్ అవుతానేమో అనే భయంలేకుండా కనీస అభ్యసనస్థాయి పొందేలా చేయడం, తద్వారా డ్రాపౌట్ రేటును తగ్గించడం సెక్షన్ 16 ప్రధాన ఉద్దేశం. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, డ్రాపౌట్లను తగ్గించడం కోసం నో –డిటెన్షన్ విధానం ఒక సదుద్దేశంతో తీసుకురావడం జరిగింది. అయితే, దీని అమలు తీరు పలు విమర్శలను ఎదుర్కొంది. ఈ విధానం పిల్లల– స్నేహపూర్వక విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ విద్య నాణ్యత, జవాబుదారీతనంపై ప్రభావం చూపింది. ప్రాథమిక విద్యపై ఇటీవల కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 5, 8 తరగతులకు నో డిటెన్షన్ పాలసీని రద్దు చేసింది.

దీని ప్రకారం ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థులపై తరగతులకు వెళ్లేందుకు తప్పనిసరిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పాసైనా, ఫెయిలైనా హాజరు శాతంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పైతరగతులకు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం విద్యార్థి ఫెయిలైతే మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. పరీక్షల ఫలితాలు వెలువడే తేదీకి రెండు నెలల్లోపే మళ్ళీ పరీక్షపెడతారు. ఒకవేళ అందులోనూ ఫెయిలైతే వారు 5, 8 తరగతులను మళ్లీ చదవాల్సి ఉంటుంది. ఫెయిలైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రాథమికోన్నత విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు కేంద్రం నిర్ణయించినట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు చేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్లు పెరుగుతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాథమిక విద్య రాష్ట్ర జాబితాలోని అంశమైనందున ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దాదాపు 3 వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు ఇది వర్తిస్తుంది. ఇప్పటికే ఢిల్లీ సహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. డిటెన్షన్ విధానం తెలంగాణలో అమలుపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం విద్యా కమిషన్ నియమించినది. ఇది విద్యా వ్యవస్థలో నాణ్యత, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమలవుతోంది. పరీక్షల్లో పాసైనా.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు. కేంద్రం నూతన విద్యా విధానం 2020 తీసుకురావడం జరిగింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలు దిశగా ముందుకుపోతున్నాయి. ఈ విధానంలో కూడా లోపాలు ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్యలో కీలక మార్పులు చేయాల్సిన అవసరమైతే ఉంది. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం, నో డిటెన్షన్ విధానంపై విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణలు సమీక్షించాలి. ప్రాథమిక స్థాయిలో నో డిటెన్షన్ విధానం రద్దువలన విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. కావున, దీనిపై పునఃసమీక్షించి 8వ తరగతి నుంచి అమలుచేస్తే బాగుంటుంది.

# టార్గెట్ తెలంగాణ అడుగులు...

హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: జనవరి 17, తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేకం గా దృష్టి సారించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలవడమే లక్ష్యం గా బీజేపీ నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా బీజేపీ తన ఉనికిని చాటు కునే ప్రయత్నం చేస్తోంది. వివిధ రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ఇప్పటికే అందించిం ది. ఊహించని విధంగా జాతీయ పసుపు బోర్డును తెలంగాణకు సంక్రాంతి కానుకగా ఇచ్చిన కేంద్రం.. తెలంగాణకు ఇది ప్రధాని మోదీ బహుమతిగా ప్రకటించింది. పసుపుతో పట్టు సాధించేందుకు బీజేపీ కసరత్తు ప్రారంభించింది. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణలో ఇప్పటికే 8 అసెంబ్లీ, అంతే సంఖ్యలో ఎంపీ సీట్లతో సత్తా చాటిన కమలం పార్టీ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ సంఖ్యను అధికార పీఠంవైపు మళ్లించేలా ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్ ఇచ్చిన కేంద్ర ప్రభు త్వం త్వరలోనే రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టును కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. దేశంలో ఇలాంటి రైల్వే ప్రాజె క్టు ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ లేదు. తెలంగాణకు ఇస్తే మాత్రం అదో పెద్ద అఛీవ్‌మెంట్ అవుతుంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అడుగుతున్న జాతీయ రహదారుల ప్రాజెక్టులను దాదాపుగా మంజూరు చేస్తూ వస్తున్నారు. రాష్ట్ర రహదారులను కూడా జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్రం అంగీకరిస్తోంది. దీనికి తోడు అనేక కొత్త రైల్వే ప్రాజెక్టులను సైతం రాష్ట్రానికి మంజూరు చేస్తున్నారు. హైదరాబాద్, కాచిగూడ, సికింద్రాబాద్, చర్లపల్లి సహా 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.2వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సైతం కేంద్రం ఇచ్చింది. దీంతో తెలంగాణకు ఊహించని విధంగా ప్రాజెక్టులు కేంద్రం నుంచి తరలివస్తున్నాయి. భవిష్యత్తులో తెలంగాణలో అధికారం చేజిక్కించుకునే లక్ష్యంతోనే బడ్జెట్ కేటాయింపులు లభిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మొదట కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వమంటే ఇవ్వమని పార్లమెంట్ సాక్షిగా చెప్పింది ఎన్డీఏ సర్కారు. దీంతో కోచ్ ఫ్యాక్టరీ రాదని ఇక్కడి ప్రజలు, రాజకీయ నాయకులు భావించారు. ఆ తర్వాత ఎవరూ ఊహించని విధంగా వ్యాగన్ వర్క్‌షాపును కాస్త కోచ్ ఫ్యాక్టరీగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే సీన్ నిజామాబాద్‌లోనూ రిపీట్ అయ్యింది. అక్కడ పసుపు బోర్డును ఇవ్వలేమని పేర్కొంటూ మొదట స్పైసెస్ బోర్డు రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇది నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కే కాదు తెలంగాణ బీజేపీకే శరాఘాతంగా మారుతుందని అంతా భావించారు. సీన్ కట్ చేస్తే స్పైసెస్ రీజినల్ కార్యాలయం పోయి జాతీయ పసుపు బోర్డు కూడా ఏర్పాటయ్యింది. ఓ సాధారణ బీజేపీ కార్యకర్తను ఈ బోర్డుకు చైర్మన్‌గా నియమించడం గమనార్హం. 2014లో టీడీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ అనంతరం ఒంటరి పోరుకు ప్రాధాన్యమిచ్చి ఎన్నికల్లో బలాన్ని పెంచుకుంటూ వస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 6 శాతం ఓట్లతో ఒక్క సీటే గెలిచిన బీజేపీ, 5 నెలల వ్యవధిలో జరిగిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 19 శాతం ఓట్లతో 4 స్థానాల్లో గెలిచింది. తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఊహించని విధంగా గణనీయమైన సీట్లు సాధించి, హుజురాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచి ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంస్థాగత సమస్యలతో 13 శాతం ఓట్లతో 8 స్థానాలకే పరిమితమైంది. 6 నెలల వ్యవధిలో జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 35 శాతం ఓట్లతో 8 స్థానాల్లో గెలిచింది. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో ఎవరున్నా.. ఢిల్లీలో మోదీయే ఉండాలనే లక్ష్యంతో ప్రజలు తీర్పు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు పొందిన బీజేపీకి ఇప్పుడు బీఆర్ఎస్ బలహీనపడడం ఒక మంచి అవకాశంగా చూస్తోంది. 8 స్థానాల్లో గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా పార్టీ బలోపేతానికి ఎంపీలు కృషి చేస్తే సగం సీట్లలో పార్టీ పటిష్టపడినట్లే. గెలిచిన 8 మంది ఎంపీలు, రెండో స్థానంలో నిలిచిన మరో ఏడుగురు ఎంపీ అభ్యర్థులతో పాటు ఇప్పటికే ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు కూడా కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేసేలా అధిష్ఠానం వ్యూహాలు రూపొందిస్తున్నది. అధిష్ఠానం రాష్ట్రానికి తాయిలాలు ప్రకటిస్తే రాబోయే ఎన్నికల్లో తాము ప్రచారం చేసుకునేందుకే కాకుండా ప్రజల్లోనూ విశ్వాసం ఏర్పడుతుందని పార్టీ నేతలు చెప్తున్నారు.

# మార్చిలో నాగబాబుకు పదవీ యోగం..?

విజయవాడ, జనవరి 17,ఆంధ్రప్రదేశ్ లో మంత్రివర్గ విస్తరణ మార్చి నెలలో జరిగే అవకాశముంది. జనసేన పార్టీ నేత కొణిదల నాగబాబును తొలుత ఎమ్మెల్సీగా చేయనున్నారు. అనంతరం ఆయనను చంద్రబాబు తన కేబినెట్ లోకి తీసుకోనున్నారు. ఇది ఫిక్సయినట్లు ఇప్పటికే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. నాగబాబు మంత్రి వర్గంలో చోటు ఖాయమైంది కాబట్టి ఆయనకు ఇచ్చే పదవిపైనా అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. ఆయనకు టూరిజంతో పాటు సినిమాటోగ్రఫీ వంటి శాఖను అప్పగిస్తారని పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అయితే సినిమాటోగ్రఫీ శాఖను నాగబాబుకు అప్పగించేందుకు పవన్ కల్యాణ్ సుముఖంగా లేరని తెలిసింది. తమ కుటుంబం మొత్తం సినీ ఇండ్రస్ట్రీలో ఉండటంతో ఆయనకు సినీమాటోగ్రఫీ శాఖను అప్పగించకూడదని పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. సినీ పరిశ్రమతో సంబంధం ఉన్న తమ కుటుంబానికి అదే శాఖ తీసుకుంటే వచ్చే ప్రశంసలకన్నా విమర్శలే ఎక్కువ వస్తాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో పాటు ఇప్పటికే టూరిజం, సినిమాటోగ్రఫీశాఖ మంత్రిగా తన పార్టీకే చెందిన కందుల దుర్గేష్ ఉన్నందున ఆయనను తప్పించి నాగబాబుకు అప్పగించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం కూడా పవన్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ రెండు కీలకమైన, సున్నితమైన శాఖలు కావడంతో వాటిని డీల్ చేయడంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా అది తమ కుటుంబంపైన కూడా ప్రభావం చూపే అవకాశముంటుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు తెలిసింది అందుకే మరో కీలకమైన శాఖను అప్పగించాలని పవన్ కల్యాణ్ చంద్రబాబును కోరనున్నారని తెలిసింది. ఇందుకోసం పవన్ కల్యాణ్ ముఖ్యనేతలతో కూడా ఇప్పటకే మంతనాలు జరిపినట్లు సమాచారం. తొలిసారి మంత్రి పదవి దక్కనుండటంతో కీలకమైన శాఖ కాకుండా నాగబాబుకు నామమాత్రపు శాఖను కట్టబెట్టాలని, కొద్దిగా శాఖపై పట్టుసంపాదించుకున్న తర్వాత ముఖ్యమైన శాఖలను కేటాయించాలని కోరితే బాగుంటుందని కూడా కొందరు సూచించినట్లు తెలిసింది. దీతో ఆయనకు ఏ శాఖ ఇవ్వాలన్న దానిపై ఇప్పటి వరకూ ఒక నిర్ణయానికి రాలేదు. అదే సమయంలో ఒకటి, రెండు శాఖలను నాగబాబుకు అప్పగిస్తే ఎలా ఉంటుందన్న దానిపై కూడా పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారని తెలిసింది. అందులో యువజన సర్వీసుల శాఖ ఒకటిగా ఉందని తెలిసింది. ఆ శాఖను ఇప్పటికే కడప జిల్లాకు చెందిన రామ్ ప్రసాద్ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఆయనకు రవాణా శాఖతో పాటు యువజనసర్వీసుల శాఖ కూడా ఉండటంతో నాగబాబుకు యువజన సర్వీసుల శాఖతో పాటుగా మత్స్యకారుల సంక్షేమ శాఖను అప్పగించాలన్న యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. ఈ రెండు శాఖల కారణంగా యువతతో పాటు కోస్తా తీరంలో ఉన్న మత్స్యకారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించగలిగితే జనసేన కూడా తీర ప్రాంతంలో పట్టుపెంచుకునేందుకు వీలుంటుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మొత్తం మీద నాగాబాబుకు మార్చి నెల చివరి వారంలో మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయి

# తెలంగాణకు అతిమర్యాద,,,

రాజమండ్రి, జనవరి 17, గోదావరి జిల్లాలు అంటే మర్యాదలకు పెట్టింది పేరు. అందులోనూ సంక్రాంతి అల్లుడికి వారు చేసే మర్యాదల గురించి తెలుగు రాష్ట్రాల్లో గొప్పగా చెప్పుకుంటారు.

అయితే ఇప్పుడు ఆ సంప్రదాయం శృతి మించుతున్న ఆనవాళ్లు క్లియర్ గా కనిపిస్తున్నాయి. అంతేకాదు ఈ " అతి " మర్యాదల ట్రెండ్ తెలంగాణకు సైతం పాకుతున్నాయి తెలంగాణ అమ్మాయిని చేసుకున్న కాకినాడ అబ్బాయి పండక్కి హైదరాబాద్ వచ్చాడని అత్తింటి వారు 130 రకాల వంటకాలతో భోజనాలు వడ్డించిన వైనం సోషల్ మీడియాలో వైరల్ అయింది. సాధారణంగా ఇలాంటి సంఘటనలు గోదావరి జిల్లాల్లో చూస్తాం. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ తెలంగాణ కూడా పాకింది. సంగారెడ్డి లోనూ ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. రానున్న రోజుల్లో ఇది మరింత గా పెరిగే ఛాన్స్ లేకపోలేదు యానాం కు చెందిన ఒక వ్యాపారి తన అల్లుడికి 465 రకాల వంటకాలతో భోజనాలు వడ్డించిన సంఘటన కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అన్ని టీవీ ఛానళ్లు, పేపర్లు దీని గురించి రాశాయి.దీన్ని చూసి ఆ కోవలో మరి కొంతమంది రెడీ అవుతున్నారు.అల్లుడికి ఇలాంటి మర్యాదలు చేయడం తప్పా అంటే కొంచెం లోతుగా మాట్లాడుకుంటే కొన్ని విషయాలు తెలిసే ఛాన్స్ ఉంది. నిజానికి ఈ ట్రెండ్ ఒక అయిదారేళ్ళ క్రితం మొదలైంది. సోషల్ మీడియా, యూ ట్యూబ్ ఛానెళ్లు ఊపు అందుకుంటున్న టైంలో యానాం, ధవళేశ్వరం ప్రాంతాల్లో కొత్తఅల్లుడి కి జరిగిన మర్యాదలపై ఎక్కువ ప్రచారం జరిగింది. అక్కడి నుంచి మొదలై ప్రతి ఏడూ ఇది ఒక ట్రెండ్ లా మారింది. ఒకళ్ళని చూసి మరొకళ్ళు వందల వెరైటీలతో అల్లుడికి భోజనాలు వడ్డించడం, ఊరేగింపులు జరిపించడం ఆనవాయితీ అయిపోయింది. దీనివల్ల మార్కెట్లోకి డబ్బు పంపిణీ జరుగడం అనేది ఒక పాజిటివ్ అంశం కావచ్చు.పిండివంటల రూపంలో, స్వీట్ షాపులకు, మేళ తాళాలకు డబ్బు డైరెక్ట్ గా పంపిణీ అవ్వడం వాళ్లకు ఉపయోగపడుతోంది. కానీ ఈ మర్యాదలు చేస్తున్న వారి ఆర్థిక స్థితి ఏంటి అనేది కూడా ముఖ్యం. సంపన్న అత్తమామలు చేసే ఈ అతి మర్యాదల ట్రెండ్ ఇప్పుడు ఎగువ మధ్య తరగతి, మధ్యతరగతి వర్గాలకు కూడా పాకుతోంది. దీనికోసం అప్పులు చేసి మరి అల్లుడి మర్యాదల కోసం, సొసైటీలో ఫాల్స్ ప్రెస్టేజ్ కోసం ఖర్చు పెడుతున్న వాళ్ళు ఎక్కువవుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతాం, ఊళ్ళో గొప్పగా చెప్పుకుంటారనే భ్రమలో అప్పుల పాలు అవుతున్న అత్త మామలు లేకపోలేదు. ఇప్పుడు నెమ్మదిగా తెలంగాణకు కూడా ఈ వైఖరి వెళ్ళిపోయింది. రానున్న రోజుల్లో అక్కడ మరింతగా పెరిగే ఛాన్స్ ఉందని పరిస్థితులు గమనిస్తున్న వాళ్ళు అంటున్నారు. అల్లుడు మంచోడు అయితే సరే.. లేకుంటే అతని గొంతెమ్మ కోరికలకు ఇబ్బందులు పడే మధ్యతరగతి అత్తా మామల కథలు చాలానే విన్నాం.ప్రస్తుతానికి సరదాగే ఉన్న ఈ "అతి " మర్యాదల ట్రెండ్ పై మిడిల్ క్లాస్ సరైన దృష్టి పెట్టకపోతే ఇదొక బ్యాడ్ ట్రెడిషనల్ గా మారిపోయే ప్రమాదం లేకపోలేదు. అల్లుడి తో సరదాగా గడిపామా లేదా, అమ్మాయి అల్లుడు ఎంత సంతోషంగా ఉన్నారు అనే దానిపై పెట్టాల్సిన దృష్టి ఈ "అతి " మర్యాదలపై పెట్టడం అంత సరికాదనే మాటలు కూడా వినిపిస్తున్నాయి ఈమధ్య. కాబట్టి మిడిల్ క్లాస్ "అత్తామామలూ ".. జరభద్రం.

8 అడుగుల విస్తరాకులో భోజనం

గోదారోళ్లంటే ఏటకారం తర్వాత గుర్తొచ్చేది ఆతిథ్యం. ఏకంగా ఎనిమిది అడుగుల ఒకే విస్తరాకులో సకుటుంబ సపరివారమంతా భోజనం చేశారు. అల్లుళ్ళు, కూతుర్లు, కుమారులు, కోడళ్లు ,మనవళ్ళకి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

గోదారోళ్లు మామూలోళ్లుకాదు. ప్రత్యేకత వారిసొంతం. ఏకంగా ఎనిమిది అడుగుల ఒకే విస్తరాకులో సకుటుంబ సపరివారమంతా భోజనం చేశారు. గోదారోళ్లంటే ఆప్యాయతలు, పలకరింపులు మనకు గుర్తుకొస్తాయి. అంతేకాదు గోదారోళ్లు భోజనం పెట్టి చంపేస్తారని నానుడి ఉంది. మామూలుగానే భారీ స్థాయిలో భోజనాలు పెడతారు. మరి సంక్రాంతి లాంటి పండుగ సమయంలో అయితే, ఇంకా వెనకడుగు వేయరుఅందులో భాగంగానే ఈ సంక్రాంతి పండుగకు కూడా కొత్త అల్లుళ్లకు 400 నుంచి 600 వరకు వెరైటీలతో విందులు ఏర్పాటు చేసి కొన్ని కుటుంబాలు వార్తాల్లోకి ఎక్కారు. మరోవైపు ఒకే భారీ విస్తరాకులో కుటుంబం మొత్తం భోజనం చేసి ప్రత్యేకంగా నిలిచారు. ఎనిమిది అడుగుల ఒకే విస్తరాకులో సకుటుంబ సపరివార సంక్రాంతి పండుగ సందర్భంగా భోజనం చేశారు.సంక్రాంతి పండుగకు ఆంధ్రప్రదేశ్‌కు పెట్టింది పేరు. అందులోనూ గోదావరి జిల్లాల్లో మరింత ప్రత్యేకంగా జరుపుకుంటారు. పందెం కోళ్లు ఒకవైపు, గుండాటలు, పేకాటలు వంటి జూద క్రీడలు మరోవైపు జోరుగా జరుగుతుంటాయి.

అదంతా ఒక ఎత్తయితే సంక్రాంతికి మర్యాదలు చేయడంలో ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేకత చాటుతారు.అదే విధంగా కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన సియాదుల సోమేశ్వరరావు, సీతారత్నం ఇంట్లో ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపారాలలో స్థిరపడి సంక్రాంతి పండగకి ఇంటికి వచ్చిన అల్లుళ్ళు, కూతుర్లు, కుమారులు, కోడళ్లు ,మనవళ్ళకి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఎనిమిది అడుగుల విస్తరాకులో అన్ని రకాల నాన్ వెజ్ వంటకాలతో వినూత్నంగా ఇంట్లోనే వండి భోజనం ఏర్పాటు చేశారు.

ముందుగా అల్లుళ్లకు వడ్డించి ఎనిమిది అడుగుల ఏకరీతి విస్తరాకుపై కుటుంబమంతా కలిసి భోజనం చేశారు. అల్లుళ్ళు, కూతుళ్లు, కొడుకులు, కోడళ్ళు, మనవళ్లు ఒకే ఆకుపై ఒకరికొకరు తినిపించుకుంటూ ఆప్యాయతల మధ్య చక్కటి విందు ఆరగించారు. రసాయనాల రంగులతో రెడీమేడ్ ప్లేట్లు వాడుతున్న ఈ కాలంలో అతిపెద్ద విస్తరాకులో వడ్డించి తమ ప్రత్యేకతను చాటారు. సంక్రాంతి అంటే అందరూ కలవడం, సరదాగా గడపడం అని చాటి చెప్పారు.

# సంక్రాంతికి ఆర్టీసీ ఆదాయం 12 కోట్లు

విజయవాడ, జనవరి 17, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ – ఏపీఎస్ఆర్టీసీ 7,200 ప్రత్యేక బస్సులు నడిపింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.12 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటివరకు ఆర్టీసీ బస్సులో దాదాపుగా 4లక్షల మంది ప్రయాణించినట్టు తెలిపింది. కనుమతో సంక్రాంతి పండుగ సంబురాలు పూర్తయినప్పటికీ.. చాలా మంది ఇంకా తిరుగు ప్రయాణం చేయలేదు. అందులోనూ వీకెండ్ దగ్గరగా ఉండడంతో సెలవుల్లో కుటుంబంతో గడుపుతున్నారు. ఇక తిరుగుప్రయాణాలు ప్రారంభం కాకపోవడంతో ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఏపీఎస్ఆర్టీసీ నడిపిన 7200 బస్సుల్లో 2153 బస్సులు హైదరాబాద్ నుంచే ఉండడం గమనార్హం.సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీస్పెషల్ బస్సులు వేసింది. జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులునడపనున్నట్టు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. తిరుగు ప్రయాణం చేసే వారికి అనుకూలంగా 3200 అదనపు బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ తెలిపింది. అయితే ఈ స్పెషల్ బస్సుల్లో ఎలాంటి ఎక్స్ ట్రా ఛార్జీలువసూలు చేయమని చెప్పడం చెప్పుకోదగిన విషయం. అంతే కాకుండా పలు బస్సుల్లో ప్రత్యేక ఆఫర్లను సైతం ప్రకటించారు. ఇరువైపులా ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్లు బుక్ చేసుకుంటే మొత్తం ఛార్జీలో 10శాతం రాయితీ ఇస్తామని చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో ప్రధానమైంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినప్పటికీ దీనిపై ఇప్పటివరకూ నిర్ణయం తీసుకోలేదు. అయితే తాజాగా ఈ పథకంపై ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం నుంచి అమలు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. దీనిపై త్వరలో జరిగే కేబినెట్ భేటీలో క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలపై చర్చించి.. అమలు తేదీలను ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.ఏపీ ప్రభుత్వం తీసుకురాబోయే ఈ కొత్త పథకం ద్వారా రోజుకు దాదాపు 20 లక్షల మందికిపైగా మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని వలన ప్రభుత్వంపై నెలకు రూ. 277 కోట్ల అదనపు భారం పడుతుందని అంటున్నారు. అందుకోసం అటు ప్రయాణికులపై భారం పడకుండా ఉన్న నిధుల్లోనే వీటిని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. కర్ణాటకలోనూ ఈ తరహా పథకం అమలవుతున్నప్పటికీ నష్టాలు పూడ్చుకునేందుకు బస్సు ఛార్జీలను 15% పెంచుతున్నట్టు ప్రకటించారు. కానీ ఇప్పటికైతే ఏపీలో బస్సు ఛార్జీలు అధికంగా ఉన్నందున ఛార్జీల పెంపు ఉండకపోవచ్చని వాదన వినిపిస్తోంది.

మార్చి 8 నుంచి ఫ్రీ బస్సు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలకమైన పథకాల అమలు చేయాలని ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల్లో ప్రధానమైంది మహిళలకు ఉచిత బస్ ప్రయాణం. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినప్పటికీ దీనిపై నిర్ణయం తీసుకోలేదు. వివిధ రాష్ట్రాల్లో ఈ పథకం అమలు అవుతున్న తీరుపై అధ్యయనం మాత్రం చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని ఆర్థిక వెసులుబాటును బట్టి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే పింఛన్లు పెంచి ఇస్తున్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు కూడా ఇస్తున్నారు. ఇప్పుడు ఉచిత బస్ పథకాన్ని అమలు చేసే దిశగా చర్యలను వేగవంతం చేశారు. తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లో ఈ మహిళలకు ఉచిత బస్ పథకం అమలు అవుతున్న తీరుపై అధ్యయనం చేశారు. మంత్రులు, అధికారులు ఆయా రాష్ట్రాల్లో పర్యటించారు. అక్కడ పథకం అమలు తీరు ప్రజలను, అధికారులను, మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకాన్ని మార్చి 8న మహిళా దినోత్సవం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అప్పటికి కూడా ప్రక్రియ మొదలు కాకుంటే కొన్ని విషయాలపై క్లారిటీ రాకుంటే ఉగాది నుంచి ప్రారంభించాలని కూడా యోచిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం శుక్రవారం జరిగే కేబినెట్ భేటీలో క్లారిటీ ఇవ్వబోతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతోపాటు మరికొన్ని సంక్షేమ పథకాలపై చర్చించనున్నారు. అమలు తేదీలను ప్రకటించనున్నారు. ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యంటించిన రాష్ట్ర బృందం సమగ్ర నివేదికను రూపొందించారు. అయితే ఉచిత బస్ పథకం అమలు చేస్తే ఏపీఎస్ఆర్టీసీపై భారం పడుతుందని దాన్ని ఎలా భరించాలనే విషయంపై కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఉచిత ప్రయాణం కారణంగా ఆర్టీసీ భారీగా ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది. దీన్ని ప్రభుత్వమే ఒఖాఖీఅకి ఇవ్వాలి. ఇది రాష్ట్ర బడ్జెట్‌పై భారం మోపనున్నాయి. వీటికి తోడు ఎక్కువ మంది మహిళలు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించే ఛాన్స్ ఉన్నందున ఇప్పుడున్న బస్‌లు సరిపోవు. అందుకే అదనంగా బస్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా సిబ్బందిని కూడా నియమించుకోవాలి. ఇలాంటి సమస్యలను ఎలా టాకిల్ చేయాలనే విషయంపై ఏపీ రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు అనిత, సంధ్య, ఆర్థిక కార్యదర్శి రోనాల్డ్ రాస్, రవాణా, రోడ్లు, భవనాల ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో కూడిన బృందం కర్ణాటక, ఢిల్లీ, తెలంగాణలో తిరిగింది. పథకం అమలు కోసం ఆయా రాష్ట్రాల్లో ప్రత్యేక బస్‌లు కొనుగోలు చేశారు. అదనంగా సిబ్బందిని కూడా నియమించారు. పథకం ప్రారంభంలో ఎదుర్కొన్న సమస్యలు గురించి అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు ఏపీ బృందానికి వివరించారు. సవాళ్లు అధిగమించేందుకు చేపట్టిన చర్యలు కూడా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రీమియం కాని అన్ని బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్పొరేషన్ వద్ద దాదాపు 11,200 బస్సులు ఉంటే అందులో 25 శాతం బస్సులే ప్రీమియం కేటగిరి కిందకు వస్తాయి. ఈ కొత్త పథకం ద్వారా రోజుకు దాదాపు 20 లక్షల మందికిపైగా మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని వలన ప్రభుత్వంపై నెలకు రూ. 277 కోట్ల అదనపు భారం పడుతుందని లెక్కలు కడుతున్నారు. అటు ప్రయాణికులపై భారం పడకుండా ఉన్న నిధుల్లోనే వీటిని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఉచిత ప్రయాణ భారాన్ని కర్ణాటక ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసింది. నష్టాలు పూడ్చుకునేందుకు బస్సు ఛార్జీలను 15% పెంచుతున్నట్టు ప్రకటించింది. అయితే ఇప్పటికే ఏపీలో బస్ ఛార్జీలు అధికంగా ఉన్నందున ఛార్జీల పెంపు ఉండకపోవచ్చని తెలుస్తోంది.

# కర్నూలుకు మహర్దశ

కర్నూలు, జనవరి 17, కర్నూలు జిల్లాకు సంక్రాంతి పండగ వేళ గుడ్ న్యూస్ అందింది. భారీ ప్రాజెక్టు కర్నూలుకు రానుంది. పది వేల కోట్ల రూపాయల వ్యయంతో భారీ ప్రాజెక్టు కర్నూలు జిల్లాలో త్వరలో ప్రారంభం కానుంది. దీంతో అనేక మందికి ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా భారీ ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తుండటం ఒకరకంగా శుభపరిణామమే. ఇప్పటికే టీసీఎస్ కంపెనీ విశాఖలో తమ సంస్థ కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధమయింది. గూగుల్ సంస్థ కూడా ఏపీకి వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే రామాయపట్నం వద్ద అతిపెద్ద దైన ఆయిల్ రిఫనరీ కంపెనీ కూడా వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.తాజాగా మరో భారీ ప్రాజెక్టు కర్నూలు జిల్లాకు రానుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆసియాలోనే అతి పెద్ద ప్రాజెక్టును రిలయన్స్ సంస్థ కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయనుంది. అతి పెద్ద సౌర ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ లో నెలకొల్పేందుకు రిలయన్స్ ఎస్ యూ సన్ టెక్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకు కర్నూలు జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇప్పటికే రిలయన్స్ సంస్థ ప్రతినిధులు దీనికి సంబంధించిన భూములను పరిశీలన చేసి వెళ్లడంతో త్వరలోనే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చే అవకాశముందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం కర్నూలు జిల్లాలో రెండు స్థలాలను ఎంపిక చేశారు. వీటిలో ఒకటి రిలయన్స్ సంస్థ ఫైనలైజ్ చేసిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి.పది వేల కోట్ల రూపాయల పెట్టుబడితో రిలయన్స్ సంస్థ ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. 930 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ తో పాటు 465 మెగా వాట్ల బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించే సమయంలోనే వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. ఇది ప్రత్యక్షంగా లభించే ఉపాధి మాత్రమే. పరోక్షంగా మరో రెండు వేల మంది ఉపాధి పొందే అవకాశముంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును ప్రారంభించాల్సి ఉందని, అందుకు సంబంధించిన ఒప్పందంకూడా త్వరలో పూర్తి చేసుకుంటామని అధికారిక వర్గాలు తెలిపాయి. బీఓటీ విధానంలోఈ సోలార్ విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి లభించే విద్యుత్తును వివిధ విద్యుత్తు సంస్థలకు పంపిణీ చేయనున్నారు. సో.. ఇది నిజంగా వరమే కదా? కర్నూలు వాసులూ.. ఆల్ ది బెస్ట్.

# గాజువాకలో... టూ లెట్ బోర్డ్స్...

విశాఖపట్టణం, జనవరి 17 గాజువాక.. ఎంతో పేరున్న ప్రాంతం. నిత్యం కళకళలాడేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. గాజువాకలోని చాలా ప్రాంతాలు ఖాళీ అయ్యాయి. అందుకు కారణం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు. ఈ ప్రభావం వేలాది కుటుంబాలపై పడింది. ఫలితంగా గాజువాకలో ఎక్కడ చూసినా టూలెట్ బోర్డులే దర్శనమిస్తున్నాయి.విశాఖ జిల్లాలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కాకముందు.. గాజువాక చిన్న గ్రామంగా ఉండేది. ఉక్కు పరిశ్రమ నిర్మాణం తర్వాత క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ.. పట్టణంగా మారింది. షీలానగర్ నుంచి అంగనపూడి వరకు చాలా వేగంగా విస్తరించింది. ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది, కార్మికులు నివసిస్తున్నారు. దీంతో గృహవినియోగాలు పెరిగాయి.డిమాండ్‌కు తగ్గట్టు గాజువాకలో ఇళ్లు నిర్మించారు. ఎంతోమంది ఇళ్లను అద్దెకు ఇచ్చి.. వచ్చిన ఆదాయం ద్వారా జీవించేవారు. కానీ.. ఇటీవల పరిస్థితి మారిపోయింది. నిత్యం కళకళలాడే గాజువాక.. నేడు బోసిపోయింది. గతంలో ఎక్కువ డబ్బులు ఇచ్చినా ఇల్లు దొరికేది కాదు. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా టూలెట్ బోర్డులే కనిపిస్తున్నాయి. గతంలో సింగిల్ బెడ్రూం ఇళ్లు అద్దె రూ.7 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.5 వేలకు కూడా అడిగేవారు లేరు.గత 3 నెలలుగా గాజువాకలో ఎక్కడ చూసినా ఖాళీ ఇళ్లే దర్శనమిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ కార్మికులకు సరిగా జీతాలు ఇవ్వకపోవడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడంతో.. చాలామంది తమతమ సొంత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. మరికొంత మంది ఢిల్లీ, ముంబయి వంటి నగరాలకు వెళ్తున్నారు. దీంతో గాజువాక క్రమంగా ఖాళీ అవుతోంది. వుడా కాలనీ, సమతానగర్, శ్రీనగర్, రిక్షా కాలనీ, ఆఫీసర్ కాలనీ, రామచంద్రానగర్, షీలానగర్ ప్రాంతాలు బోసిపోయాయి.చాలామంది వ్యాపారులు, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు గాజువాకలో ఇళ్లు నిర్మించుకున్నారు. రిటైర్ అయ్యాక వచ్చే అద్దెలతో బతకొచ్చని ఆశించారు. ఇప్పుడు ఈ పరిస్థితి రావడంతో.. ఏం చేయాలని పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. స్టీల్ ప్లాంట్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమంది వరకు జీవించేవారు. కానీ దాన్ని నిర్వీర్యం చేస్తుండటంతో.. ఎంతోమంది వేరే ఉపాధి అవకాశాలు ఉన్నచోటకు వెళ్తున్నారుగాజువాకలో మార్కెట్ చాలా ఫేమస్. ఏ వస్తువు కావాలన్నా అక్కడ లభిస్తుంది. కానీ ఇటీవల అక్కడ సరిగా వ్యాపారం సాగడం లేదు. స్టీల్ ప్లాంట్‌లో పనిచేసే వారికి సరిగా జీతాలు రాక ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగలేదు. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతికి కూడా వ్యాపారం సరిగా లేదని చెబుతున్నారు. మంచి మంచి ఆఫర్లు ప్రకటించినా.. అమ్మకాలు లేవని వ్యాపారులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. గాజువాక మొత్తం ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బీజాపూర్ లో భారీ ఎన్కౌంటర్

బీజాపూర్ ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజూపూర్ లో భారీ ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు 12 మంది మావోయిస్టు మృతి చెందినట్లు సమాచారం. ఎన్కౌంటర్లో మావోయిస్టుల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుంది. బీజాపూర్ జిల్లా హోసూర్ పీఎస్ పరిధిలో ఎన్కౌంటర్ జరిగింది. ఎదురు కాల్పుల తరువాత భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు..

# చిత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.

## నలుగురు మృతి, 22 మందికి గాయాలు.

## చిత్తూరు సమీపం లోని గంగాసాగరం వద్ద జరిగిన ప్రమాదం.

చిత్తూరు తచ్చూరు హైవే నిర్మాణ పనుల్లో భాగంగా ఆగి ఉన్న టిప్పర్ ను తప్పించబోయి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. అతివేగంతో ప్రమాదానికి గురై డివైడర్ ను ఢీ కొని రోడ్డుకు అడ్డంగా పడింది. తిరుపతి నుంచి తిరుచ్చి కి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెళుతుంది. అర్ధరాత్రి 2 గంటల సమయం లో ఘటన జరిగింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చిత్తూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న వారిని సీఎంసీ వేలూరు ఆసుపత్రి కి తరలించారు.

# బీటెక్ విద్యార్థినిపై అత్యాచారం.. నిందితుడి అరెస్ట్

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 17 ప్రైవేటు హాస్టల్‌లో బీటెక్ విద్యార్థినిపై ఓ యువకుడు అత్యాచారం చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యిద్యార్థిని ఇబ్రహీంపట్నంలో ఓ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె మంగల్‌పల్లిలో ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉండి చదువు కొనసాగిస్తోంది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పై అంతస్థులో వసతి గృహం నిర్వహించడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో స్థిరాస్తి ఆఫీస్ ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులలో ఒకరి జన్మదిన వేడుకలు జరిగాయి. సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద నల్లగొండ జిల్లాకు చెందిన అజిత్(22) కారు డ్రైవర్‌గా పని చేశాడు. జన్మదిన వేడుకలలో పాల్గొన్న అజిత్ ప్రైవేట్ హాస్టల్ రూమ్‌లో వెళ్లి విద్యార్థినిపై అత్యాచారం చేస్తుండగా కేకలు వేసింది. పక్క గదిలోని విద్యార్థులు గడియ పెట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ఏపీలో క్రీడా రాజకీయాలు...

విజయవాడ, జనవరి 17, రాజకీయ పార్టీల ఆధిపత్యం తప్ప ఏపీలో క్రీడల ప్రోత్సాహానికి సహకారం మాత్రం కొరవడింది.కొన్నేళ్లుగా క్రీడా సంఘాల్లో మితిమీరిన రాజకీయ జోక్యం క్రీడల పాలిట శాపంగా మారింది. అధికారంలో ఉన్న పార్టీల ప్రాపకం కోసం క్రీడా సంఘాలు వెంపర్లాడటంతో అసలు లక్ష్యం మరుగు పడిపోయింది.

బిక్రీడా సంఘాల్ని నిర్వీర్యం చేసి వాటిని ఫక్తు రాజకీయ సంఘాలుగా మార్చేయడంలో అన్ని పార్టీలకు వాటా ఉంది

. క్రీడా సంఘాలతో వచ్చే గుర్తింపు, ఈవెంట్ల నిర్వహణలో వచ్చే ఆదాయం గురించి తప్ప క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడంతో వాటిని అక్రమాలకు కేంద్రాలుగా మార్చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో క్రీడల్ని రాజకీయాలకు అతీతంగా స్వతంత్రంగా ఉంచాల్సిన ప్రభుత్వాల పాపమే ఎక్కువగా ఉంది.మరికొద్ది రోజుల్లో ఉత్తరాఖండ్‌లో 38వ నేషనల్ గేమ్స్ ప్రారంభమవుతున్న తరుణంలో ఏపీ క్రీడాకారులు వాటిలో పాల్గొనడంపై సందిగ్ధత కొనసాగుతుంది. ఏపీలో పేరు స్పోర్ట్స్ అథారిటీ, క్రీడల కోసం ప్రత్యేకంగా ఓ మంత్రి ఉన్నా నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే విషయంలో మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. నేషనల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రాతినిథ్యం కంటే ఏపీ ఒలంపిక్ అసోసియేషన్‌ను దక్కించుకోడానికే అధికార పార్టీ నేతలు ప్రాధాన్యమిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ నుంచి 250మంది క్రీడాకారులు, కోచ్‌లు, అయా సంఘాల ప్రతినిధులు ఉత్తరాఖండ్‌లో వేర్వేరు ప్రదేశాల్లో జరిగే ఈవెంట్లలో పాల్గొనాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడం క్రీడాకారుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. నేషనల్ గేమ్స్‌లో పాల్గొనడానికి దాదాపు రూ.33లక్షల రుపాయలు ఖర్చుకానుండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఏపీ ఒలంపిక్ సంఘానికి ఎలాంటి భరోసా దక్కలేదు.ఏపీలో క్రీడల్లో పతకాలు సాధిస్తే వారిక పురస్కారాలు, నజరానాలు, భారీ బహుమతులు, ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతున్నాయి.

ఈ క్రమంలో ఊరు పేరు లేని క్రీడా సంఘాలు రాష్ట్ర, జాతీయ స్థాయి ఈవెంట్ల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ నోటిఫికేషన్లలో కొన్ని నకిలీ సంఘాలు జారీ చేసిన ఫేక్ సర్టిఫికెట్లతో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకున్నారు. శాప్ సహకారంతో జరిగిన కోట్ల రుపాయల స్కామ్ వ్యవహారంపై కొన్నాళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో అక్రమాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే కొందరు నేషనల్ గేమ్స్‌లో ఏపీ జట్లు పాల్గొనకుండా అడ్డుతగులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయిఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు ముందు నుంచి శాప్ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి ఒలంపిక్ సంఘం పూర్తిగా రాజకీయాల్లో చిక్కుకుపోయింది. అధికారంలో ఉన్న పార్టీలు క్రీడల్ని, క్రీడా సంఘాల్ని తమ జేబు సంస్థలుగా మార్చేసుకున్నాయి. కొన్ని క్రీడా సంఘాల్లో నేరచరితులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు, వైట్ కాలర్ నేరాలకు పాల్పడిన వారు చొరబడటంతో క్రీడలు మరింత దిగజారిపోయాయి.కేసుల నుంచి బయట పడటానికి రాజకీయ నేతల్ని ఆశ్రయించడం, క్రీడాకారుల జీవితాలను ఫణంగా పెట్టడం వంటి ఆరోపణలు కూడా కొన్ని సంఘాల నేతలపై ఉన్నాయి. వీటన్నింటికి అడ్డు కట్ట వేయాల్సిన శాప్ కూడా వారి చెప్పు చేతల్లోకి వెళ్లిపోయింది.రాష్ట్రం విడిపోయిన తర్వాత శాప్ బాధ్యతలు చేపట్టిన వారిలో ఒక్కరు కూడా క్రీడల్ని ప్రోత్సహించలా పనితీరు ప్రదర్శించ లేకపోయారు.

తమకు పదవి ఇచ్చిన రాజకీయ పార్టీ భజన చేయడానికే సదరు నేతలు పరిమితం అయ్యారు. ప్రస్తుతం జాతీయ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రోత్సహించే విషయంలో కూడా తమకు కలిగే ప్రయోజనాల గురించి లెక్కలు వేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్రీడా శాఖ మంత్రిగా ఉన్న రాంప్రసాద్ రెడ్డి సొంత వ్యవహారాల్లో తీరిక లేకుండా ఉండటంతో నేషనల్ గేమ్స్‌లో ఏపీ జట్టు ప్రాతినిథ్యం వహించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# మళ్లీ మంచు ఫ్యామిలీలో గొడవలు

తిరుపతి, జనవరి 17, మంచు ఫ్యామిలీ వివాదం మరోసారి పోలీస్ స్టేషన్ కు చేరింది. నిన్న మోహన్ బాబు వర్సిటీ వద్ద ఘటనపై పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. తనపై, తన సిబ్బందిపై దాడికి పాల్పడ్డారని మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంచు ఫ్యామిలీలో విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. నిన్న తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద హైడ్రామా చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మంచు మనోజ్ ను పోలీసులు అడ్డుకున్నారు. తన తాత, నానమ్మల సమాధులకు దండం పెట్టుకునేందుకు యూనివర్సిటీలోకి వెళ్లేందుకు మనోజ్ ప్రయత్నించారు. అయితే కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో లోపలకు అనుమతించలేమని పోలీసులు మనోజ్ ను అడ్డుకున్నారు. అనంతరం ఆయనను లోపలకు పంపించారు. ఈ సమయంలో మోహన్ బాబు, మనోజ్ బౌన్సర్ల మధ్య ఘర్షణ జరిగింది చంద్రగిరి పోలీస్ స్టేషన్ కు మంచు మనోజ్ వెళ్లారు. నిన్న జరిగిన పరిణామాలపై డీఎస్పీతో మనోజ్ చర్చించారు. కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్లు తనకు అందకపోవడం మాట్లాడారు. మనోజ్ తో పాటు ఆయన భార్య మౌనిక, లీగల్ టీమ్ ఉన్నారు. మంచు మనోజ్, మౌనిక దంపతులు చంద్రగిరి పోలీసుస్టేషన్ లో మోహన్ బాబు యూనివర్సిటీలో జరిగిన ఘటనపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై, తన భార్య మౌనిక, అనుచరులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంటిలోకి తనను అనుమతించకపోవడంపై పోలీసులను ప్రశ్నించారు. శాంతి భద్రతల కారణంగా తిరుపతి వదిలి వెళ్లాలని మంచు మనోజ్‌కు పోలీసులు సూచించారు. ఫిర్యాదు చేసిన అనంతరం మనోజ్ దంపతులు మల్లయ్యగారిపల్లెకు వెళ్లిపోయారు.పోలీస్ స్టేషన్ ఫిర్యాదు అనంతరం మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ...పండుగకు ఇంటికి వస్తే గేట్లు వేశారని, తన వాళ్లపై దాడి చేశారని ఆవేదన చెందారు. నిన్న మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద తన అనుచరులు పళణి, వినాయకపై ఎంబీయూ సిబ్బంది హేమాద్రి నాయుడు, కిరణ్ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. తన కుటుంబంలో జరుగుతున్న ఘటనలు బాధాకరం అన్నారు. పండుగకు ఇంటికి వస్తే గేట్లు మూసివేశారని, తాత, నానమ్మల సమాధులకు నివాళులు అర్పించేందుకు వెళ్తే అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన వాళ్లపై దాడి చేయడమే కాకుండా, గేట్లు దూకి వెళ్లినట్లు తనపై ఫిర్యాదు చేశారని ఆవేదన చెందారు.ఎనిమిదేళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్నా, తనపై అభిమానులు ప్రేమ చూపిస్తున్నారని మనోజ్ అన్నారు. తనతో సమస్య ఉంటే మాట్లాడాలని, తాను ఎక్కడికి పారిపోలేదన్నారు. తన వాళ్ల వాహనాల్లో చక్కెర పోయడం, కట్టిన బ్యానర్లు తొలగించడం ఏంటని మండిపడ్డారు. డబ్బులిచ్చి, కిరాయి మనుషులతో తిరిగే వాడిని కాదన్నారు. పండుగ సమయంలో తన వాళ్లను పిలిపించి మనోజ్ తో ఉండకూడదని బెదిరించారన్నారు. నలుగురు పెద్ద మనుషులను పిలిచి, అన్నదమ్ములతో మాట్లాడితే సరిపోయే చిన్న విషయాన్ని పెద్దది చేస్తున్నారన్నారు. నారావారిపల్లెకు వెళ్లి మంత్రి లోకేశ్ ను కలవడంపై మంచు మనోజ్ స్పందించారు. కేవలం మర్యాదపూర్వకంగా కలవడానికే అని స్పష్టం చేశారు.

## రోడ్లపై నెంబర్ ప్లేట్ లేని వాహనాలు పట్టించుకోని పోలీసులు







**ప్రజాబలం ప్రతినిధి మెదక్ జనవరి 17** మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ రూలర్ పాపన్నపేట్ పోలీస్ స్టేషన్ అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలోని టేక్మాల్ అల్లాదుర్గం పెద్ద శంకరంపేట్ రేగోడు తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్ కౌడిపల్లి ఇతర పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారు మరియు కార్లు వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ తీసివేసి రోడ్లపై తిరుగుతున్నారు పోలీసులు రవాణా శాఖ అధికారులు తనిఖీలు లేకుండా పోయాయి రోడ్లపై నెంబర్ ప్లేట్ లేని వాహనాలు కనబడిన పోలీసులు మాత్రం చూసి చూడనట్టుగా వదిలిపెడుతున్నారు పెద్ద శంకరంపేట మండలంలో ఎక్కడ చూసిన నెంబర్ ప్లేట్ లేని వాహనాలు కనపడతాయి అక్కడి పోలీసులు మాత్రం నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిఘ వైఫల్యం కనపడుతుంది కొందరు బుల్లెట్ వాహనదారులు సైలెన్సర్లు తీసేసి ప్రజలు ఎక్కువగా ఉన్న స్థలాలలో పెద్ద శబ్దంతో వాహనాలపై వెళ్లడంతో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి జిల్లా ఎస్పీ రవాణా శాఖ అధికారులు స్పందించి రోడ్లపై నెంబర్ ప్లేట్ లేని వాహనదారులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

# తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, నాయకుడు నందమూరి తారక రామరావు

## -నేడు ఆయన వర్ధంతి



రాముడు, కృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు లాంటి పౌరాణిక పాత్రల్లో నటించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన యుగపురుషుడు ఎన్‌టిఆర్. జానపదం, సాంఘికం, పౌరాణికం అనే తేడా లేకుండా అన్ని పాత్రల్లో జీవించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు కృష్ణా జిల్లా నిమ్మకూరులో 1923 మే 28న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ.ఎన్‌టిఆర్ పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ హై స్కూల్‌లో పూర్తి చేసి ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చేరాడు. కళాశాల విద్య కొనసాగుతుండగానే మేనమామ కూతురు బసవ తారకంను వివాహమాడి గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో బిఏ చేశారు. ఎన్‌టిఆర్‌కు మొదటి నుంచి నాటక రంగంపై మక్కువ ఎక్కువ. విజయవాడ ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చదువుతున్నప్పుడు నాగమ్మ పాత్ర వేశారు. నూనూగు మీసాలు తీసేందుకు ససేమిరా అనడంతో ఆ పాత్రకు మీసాల నాగమ్మ అని పేరు తగిలించారు. గుంటూరు క్రిస్టియన్ కళాశాలలో చదువుతున్నప్పుడు నేషనల్ ఆర్ట్ థియేటర్‌ను ఏర్పాటు చేసి జగ్గయ్య, ముక్కామల, నాగభూషణం తదితరులతో "చేసిన పాపం" వంటి నాటకాలు ఆడారు.

సినిమా రంగంపై మక్కువతో మంగళగిరిలో సబ్ రిజిస్ట్రార్‌గా చేస్తోన్న ఎన్‌టిఆర్ చెన్నై ట్రేన్ ఎక్కేశారు. తొలి అవకాశం 'పల్లెటూరి పిల్ల' సినిమాకు వచ్చినా విడుదలైంది మాత్రం 'మనదేశం' చిత్రం. షావుకారు చిత్రం తరువాత నివాసాన్ని చెన్నై థౌజండ్ లైట్స్ ప్రాంతానికి మార్చుకున్నారు. విజయావారి బ్యానర్‌పై వచ్చిన పాతళభైరవి, మల్లీశ్వరి, పెళ్లిచేసి చూడు, చంద్రహారం చిత్రాలు ఎన్‌టిఆర్‌ను తిరుగులేని నటుడిగా నిరూపించాయి. మాయాబజార్, లవకుశ, శ్రీకృష్ణార్జున యుద్ధం, భీష్మ, భూకైలాష్, నర్తనశాల, పాండవ వనవాసం, శ్రీ వెంకటేశ్వరస్వామి మహత్యం, మహామంత్రి తిమ్మరుసు, దానవీరశూరకర్ణ చిత్రాలు విశ్వ విఖ్యాత ఎన్‌టిరామారావును మకుటం లేని మహారాజుగా నిలబెట్టాయి. కన్యాశుల్కం, గుండమ్మకథ, అడవిరాముడు, వేటగాడు, గజదొంగ, డ్రైవర్ రాముడు, సర్దార్ పాపారాయుడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, బొబ్బిలిపులి చిత్రాల్లో ఆయన విలక్షణ నటనను ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోరు. ఎన్‌టిఆర్ నటించిన చివరి చిత్రం మేజర్ చంద్రకాంత్. తన కెరీర్లో ఆయన దాదాపు 320కి పైగా చిత్రాల్లో నటించారు.చిత్ర సీమలో నెంబర్ వన్‌గా నిలిపిన అభిమానులకు, ప్రజలకు సేవ చేయాలని తలిచిన ఎన్‌టిఆర్ తెలుగుదేశం అనే రాజకీయపార్టీ స్థాపించారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే వటవృక్షం లాంటి కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి ఆంధ్రప్రదేశ్‌లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తెలుగువాడి ఆత్మగౌరవం పేరుతో ప్రచార రథంపై సుడిగాలి పర్యటన చేశారు. అంతర్గత కుమ్ములాటలో కొట్టుమిట్టాడే కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా మారడాన్ని ప్రచారాస్త్రాలుగా చేసుకుని ఆయన చేసిన ప్రసంగాలు తెలుగువారి గుండెల్లో పౌరుషాగ్నిని నిలిపాయి.పేదవాడి కడుపు నింపే రెండు రూపాయలకు కిలోబియ్యం, సగం ధరకే చేనేత వస్త్రాలు, రైతన్నకు సబ్సిడీపై విద్యుత్ తదితర ప్రజాకర్షక, ప్రజాసంక్షేమ పథకాలు తిరుగులేని విజయాన్ని అందించాయి. ఆడిన మాట తప్పని "అన్న"ఎన్‌టిఆర్ అధికారంలో కొనసాగినంత కాలం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. నాదేండ్ల బాస్కర రావు నుంచి వెన్నుపోటు ఎదుర్కొన్న ఎన్‌టిఆర్ మరోసారి ప్రజా తీర్పు కోరి తిరుగులేని మెజార్టీ సాధించి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. 1985 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయన 1989 ఎన్నికల్లో ఓటమి చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపించిన ఎన్‌టిఆర్ దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను ఐక్యపథంలో నడిపించి నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. కేంద్రంలో తొలి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చేయించారు.తిరిగి 1994లో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక అసెంబ్లీ స్థానాల్లో విజయ దుందుబి మోగించి అఖండ మెజార్టీతో అధికారం చేపట్టారు. తెలుగు దేశం పార్టీలో అంతర్గత పరిస్థితుల కారణంగా ఎన్‌టిఆర్ నుంచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పీఠాన్ని హస్తగతం చేసుకున్నారు. 1996 జనవరి 18న ఎన్‌టిఆర్ గుండెపోటుతో మరణించారు. భౌతికంగా ఆయన దూరమైనా ప్రజలు, అభిమానుల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

# కోటి సభ్యత్వాలకు పైగా నమోదుతో చరిత్ర సృష్టించిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు.


**టీడీపీకి కార్యకర్తలే బలం, బలగం.**
**ప్రాణసమానమైన నా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు**
**హృదయపూర్వక కృతజ్ఞతలు.**
**మైలవరం నియోజకవర్గంలో 66,369 సభ్యత్వాల నమోదు.**
**మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు**

మైలవరం టీడీపీ కోటి సభ్యత్వాలకు పైగా నమోదుతో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు చరిత్ర సృష్టించారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ అన్న ఎన్టీఆర్ గారు పార్టీని స్థాపించినప్పుడు ఒక్కరితో ఆరంభమైన ప్రయాణం నేడు కోటి మందికి పైగా కుటుంబ సభ్యులతో వర్ధిల్లుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 52 వేల 598 సభ్యత్వములు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో కూడా 66,369 మంది సభ్యత్వములు నమోదు చేసుకున్నారని అన్నారు. లైఫ్ టైమ్ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సభ్యత్వ నమోదును ప్రతి గ్రామంలో ఒక ఉత్సవంలా నిర్వహించారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారన్నారు.ముఖ్యంగా ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. అలానే ఏ పార్టీ ఇవ్వని గౌరవం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఇస్తుందన్నారు.కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవిస్తూ తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమంతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంతోషం కోసం సీఎం చంద్రబాబు గారు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు టీడీపీ కార్యకర్తల సంక్షేమ విభాగం నిర్విరామంగా శ్రమిస్తుందోన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ శాసనసభ్యులు కృష్ణప్రసాదు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆకాశంలో పేలిన స్టార్‌షిప్ రాకెట్



టెక్సాస్ జనవరి 17 ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ 'స్టార్‌షిప్' కీలక ప్రయోగం విఫలమైంది. అధునాతన సాంకేతికతతో ఆధునికీకరించి, తొలి పరీక్షగా పేలోడ్ మాక్ శాటిలైట్లను ప్రయోగించగా ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. గురువారం సాయంత్రం 5.38 గంటల సమయంలో అమెరికాలోని టెక్సాస్ నుంచి ప్రయోగించిన కొన్ని నిమిషాలకే స్టార్‌షిప్ ఆకాశంలో ముక్కలు ముక్కలైంది. అప్‌గ్రేడ్ చేసిన స్టార్‌షిప్‌తోస్పేస్ ఎక్స్ మిషన్ కంట్రోల్ సంబంధాలు తెగిపోయాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. రాకెట్ ప్రోగ్రామ్‌ను మార్చవలసి ఉంటుందని వారు సూచించారు. 'అప్పర్ స్టేజ్'లో సమస్య ఉన్నట్లు అర్థం అవుతోందని స్పేస్ ఎక్స్ కమ్యూనికేషన్స్ మేనేజర్ డాన్ హుట్ ధ్రువీకరించారు.రాకెట్ పేలుడుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైతీ రాజధాని పోర్ట్ ఔ ప్రిన్స్ గగనతలంలో స్టార్‌షిప్ పేలిపోగా నారింజ రంగులో అగ్ని గోళాలు ఎగసిపడ్డాయి. పొగక కూడా వ్యాపించింది. స్టార్‌షిప్ శకలాలు ఆకాశంలో చెల్లాచెదురు కావడంతో గల్ఫ్ ఆఫ్ మెక్సికో మీదుగా విమానాల రాకపోకలపై అప్రమత్తత ప్రకటించారు. విమానాలకు శకలాలు తగిలితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో జాగ్రత్తగా ఉండాలని స్పేస్ ఎక్స్ సూచించింది. అటు వైపుగా విమానాలు రాకుండా చూసుకోవాలని సంస్థ సూచించింది. కాగా, నిరుడు మార్చిలో కూడా స్టార్‌షిప్‌కు 'అప్పర్ స్టేజ్' సమస్య ఉత్పన్నమైంది. అప్పుడు కూడా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# అమెరికాను వణికిస్తున్న చలిగాలులు, కార్చిచ్చు

అమెరికాలోని లాస్ ఎంజెల్స్ లో చెలరేగిన కార్చిచ్చు క్రమంగా తీవ్రమవుతుండా...అక్కడి అత్యయిక పరిస్థితి ప్రకటించాల్సి వచ్చింది. ఇప్పటికే.. వేల ఎకరాలకు అలుముకున్న మంటలు రానురాను మరింత బలంగా మారి.. దట్టమైన అటవినీ కాల్చేస్తున్నాయి. ఇప్పటి వరకు అగ్ని కీలల కారణంగా.. లాస్ ఎంజెల్స్, కాలిఫోర్నియా నగరాల్లో ఏకంగా 10 మంది చనిపోగా, 1 లక్షా 30 వేల మందిని బలవంతంగా అక్కడి నుంచి తరలించాల్సి వచ్చింది. ఈ అగ్నిప్రమాదంలో.. బాలివుడ్ కి చెందిన ఎంతో మంది నటీనటుల ఇళ్లు దగ్ధమవుతున్నాయి. వాటిలో.. పారిస్ హిల్టన్, ఆడమ్ బ్రోడే, బిల్లే క్రిస్టల్ సహా మిగతా వారి ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇప్పటికే.. హాలివుడ్ స్టూడియోస్ ఉన్న కొండ అగ్నిప్రమాదంలో చిక్కుకోగా.. ఆస్కార్ అవార్డుల ప్రకటనను అగ్నిప్రమాద తీవ్రత దృష్ట్యా రెండు రోజుల పాటు వాయిదా వేశారు.అమెరికాలోని విస్తారమైన అడవుల్లో నిత్యం అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కానీ.. ప్రస్తుతం అక్కడ చలి కాలం నడుస్తుంది. ఓ వైపు అతి శీతల గాలులు అమెరికాను గడగడ వణిస్తున్నాయి. ఈ తరుణంలో.. అగ్ని ప్రమాదం జరగడానికి కారణాలేంటా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా.. అమెరికా చరిత్రలోనే పూర్తి చలికాలంలో ఇలాంటి అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడం.. వింతగా ఉంది అంటున్నారు అక్కడి ప్రజలు. అయితే.. దట్టమైన అడవిలో నుంచి వేసిన పవర్ కేబుళ్లు ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. కానీ.. ఆ విషయాన్ని పూర్తిగా నిర్థరించేందుకు వీలు లేదంటున్నారు. స్పష్టమైన కారణాలు తెలియాలంటే.. ఇంకా సమయం పడుతుందని అంటున్నారు. 2022, 2023లోని శీతాకాలాల్లో లాస్ ఏంజిల్స్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో పూర్తిగా తడి వాతావరణం ఉంది. కానీ.. ఈ శీతాకాలంలో దక్షిణ కాలిఫోర్నియాలో అనూహ్యంగా పొడి వాతావరణం ఏర్పడింది. దాంతో భారీగా వృక్ష సంపద అంతా ఎండిపోయింది. ప్రస్తుతం.. అగ్ని ప్రమాదం వేగంగా వ్యాప్తి చెందుతున్న మార్గం.. ఇలా పొడిగా మారిన మార్గమే.నాసా ప్రకారం అక్టోబర్ నుంచి దక్షిణ కాలిఫోర్నియాలో చాలా తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. దాంతో ఈ ప్రాంతంలో రికార్డు స్థాయిలో శీతాకాలమైనా పొడి వాతావరణం ఏర్పడినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లాస్ ఏంజిల్స్ విమానాశ్రయంలో అక్టోబర్ 1 నుంచి 0.03 అంగుళాల (0.08 సెంటీమీటర్లు) వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో.. భూమి తడి వాతావరణాన్ని కోల్పోయిందని, అడవులు సైతం బాగా పొడిగా మారిపోయాయని అంటున్నారు.లాస్ ఏంజెలెస్ లోని ఈశాన్య ప్రాంతంలోని పర్వతాల దగ్గర తొలుత ఈ మంటలు మొదలు కాగా.. క్రమంగా బలమైన గాలులతో మిగతా ప్రాంతాలకు వ్యాప్తిస్తున్నాయని అంటున్నారు. దాంతో పాటూ పసిఫిక్ పాలిసాడ్స్ ప్రాంతంలో మరో అగ్గి రాజుకుంది. ఇది తీరం వెంట ఉన్న సెలబ్రిటీల నివాస ప్రాంతం మొత్తాన్ని కమ్మేసింది. ఇప్పటివరకు రెండువేల ఇళ్ళు అగ్నికి ఆహుతి కాగా.. దాదాపు రూ. 5 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని ఓ అంచనా.ఈ సీజన్‌లో కాలిఫోర్నియాలో శాంటా అనా గాలులు సాధారణంగా ఉంటాయి. కానీ ఈ సంవత్సరం అవి అసాధారణంగా చాలా బలంగా ఉన్నాయంటున్నారు వాతావరణ శాస్త్రవేత్తలు. ఈ కారణంగానే.. పొడి వాతావరణంలో రాజుకున్న కార్చిచ్చు.. బలమైన గాలులు తోడవడంతో మరింత పెద్దవిగా మారిపోయి, వేగంగా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయని అంటున్నారు. అక్టోబర్-జనవరి మధ్య గ్రేట్ బేసిన్ ఎడారులలో అధిక పీడనం ఏర్పడుతుంది. ఈ అధిక పీడనం సవ్యదిశలో తిరుగుతూ.. గాలిని పడమర వైపునకు, తీరం వైపునకు తీసుకొస్తుంది. ఈ గాలులు.. సియెర్రా నెవాడా, శాంటా అనా పర్వతాల మీదుగా వీస్తుందంటున్న శాస్త్రవేత్తలు.. అక్కడే ఇవి తేమను కోల్పోయి, వేడెక్కుతాయని అంటున్నారు. పైగా.. పర్వతాల మధ్య నుంచి ప్రవహించడంతో చాలా వేగంగా వీస్తాయని అంటున్నారు. ఇప్పుడు ఈ గాలుల వల్లే.. దక్షిణ కాలిఫోర్నియా మీదుగా వీచే సమయానికి.. గాలి వేగంగా, పొడిగా, వెచ్చగా ఉంటుందని చెబుతున్నారు. అందుకే.. ఈ గాలులు అగ్ని కీలల్ని మరింత ఉద్ధృతంగా వీచేలా చేస్తున్నాయని అంటున్నారు.ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇవి మనిషిపై నేరుగా, పరోక్షంగా అనేక ప్రభావాల్ని కలిగిస్తున్నాయి. కాలిఫోర్నియాలో కొన్నేళ్లుగా.. అడవుల్లో మంటలు భారీగా చోటుచేసుకుంటున్నాయి. ప్రతీసారి.. వేల ఎకరాల్లోని వృక్ష సంపద అగ్నికి ఆహుతి అవుతోంది. నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్ -2021 ప్రకారం.. గత రెండు దశాబ్దాల్లో సగటు అగ్ని ప్రమాదాల నిష్పత్తి పెరిగింది అంటున్నారు. వీటన్నింటికీ.. కారణం అంతర్జాతీయంగా పెరిగిన ఉష్ణోగ్రతలే అంటున్నారుఓవైపు అగ్ని కీలలు.. అమెరికాలోని సగం ప్రాంతాన్ని చుట్టుముట్టి ఇబ్బంది పెడుతుంటే.. మరోవైపు భారీగా కురుస్తున్న మంచుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో -18 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకరంగా మారింది. అమెరికా అధికారుల లెక్కల ప్రకారం.. అమెరికాలోని సుమారు 30 రాష్ట్రాలు మంచు తుఫానులో కూరుకుపోయినట్లు తెలుస్తోంది.ఆయా ప్రాంతాల్లోని ప్రజలు.. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా? 6 కోట్ల మంది అమెరికన్లపై తీవ్ర ప్రభావం పడిందని అంటున్నారు. ప్రస్తుతానికి..యూఎస్ లోని ఏడు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు అక్కడి అధికారులు.ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న చల్లటి గాలి.. సెంట్రల్ అమెరికాను తీవ్రంగా వణికిస్తోంది. ఈ రాష్ట్రాల్లో అత్యల్పంగా 0 నుంచి ?15 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అమెరికా వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. ఈ మొత్తంలో.. అమెరికాలోని చాలా ప్రాంతాలు స్థంభించిపోగా.. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆఫీసులు మూతపడ్డాయి.

# 2కొండెనిక్కిన ఆయిల్ ధరలు

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 17, మలేషియా స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో పతనం కారణంగా, దేశీయ చమురు-నూనె గింజలపై తీవ్ర ప్రభావం పడింది. దేశంలోని చమురులో ఆవాలు-నూనె గింజలు, వేరుశెనగ నూనె, సోయాబీన్ నూనె, ముడి పామాయిల్, పత్తి గింజల నూనె ధరలు పెరిగాయి. నూనెగింజల మార్కెట్‌లో నష్టాలు చవిచూశాయి.

అయితే ఇవాళ కాస్త నూనె గింజల ధరలు మెరుగుపడుతుండగా, వేరుశనగ నూనె గింజలు, సోయాబీన్ నూనె గింజల ధరలు మునుపటి స్థాయిలోనే ఉన్నాయి. దేశీయంగా ఎడిబుల్ ఆయిల్స్ ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఆవాల బంపర్ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో ఇదీ పరిస్థితి. ఇప్పటికీ ఆవాల నూనె కిలోకు పది రూపాయలు పెరిగింది. ఈ విధంగా వేరుశెనగ నూనె ధరలు రూ.15 నుంచి 20 పెరగ్గా, శుద్ధి చేసిన సోయాబీన్ ధరలు కూడా రూ.10 నుంచి 15 వరకు పెరిగాయి. విదేశీ నూనెలు కూడా పెరిగాయి. ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో వంటనూనెల ధరలు స్పెక్యులేటర్లపైనే ఆధారపడి ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే నూనెల ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారమలేషియా ఎక్స్‌ఛేంజ్‌లో క్షీణత కొనసాగుతోంది. చికాగో ఎక్స్ఛేంజ్‌లో మెరుగుదల ఉంది. వచ్చే నెలలో మార్కెట్లకు కొత్త ఆవాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆవాలు, కందుల ధరలు తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఆవాలు ఈసారి ఎటువంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోలేదు. ఎందుకంటే ఊంఈఇఆ, ఔంఈఇఆ వంటి సహకార సంస్థలు చాలా నియంత్రణలో మార్కెట్‌లో ఆవాల స్టాక్‌ను విడుదల చేశాయి. 2024-25 సంవత్సరం (నవంబర్-అక్టోబర్) మొదటి రెండు నెలల్లో భారతదేశం ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిలో 13.03 శాతం పెరుగుదల నమోదు చేసింది.ఇటీవలి కాలంలో వేరుశనగ, పత్తి గింజల ధరల్లో మెరుగుదల కనిపించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ఈ నూనె గింజల ధరల్లో క్వింటాల్‌కు రూ.15-20 మెరుగుపడడం, ఈ నూనె గింజల ఎడిబుల్ ఆయిల్ ధరలు తగ్గడం, వేరుశనగ నూనె, పత్తి గింజల తగ్గుదలకు ప్రధాన కారణం. నూనె. సోయాబీన్ డీగమ్ ఆయిల్ దిగుమతికి కిలోకు రూ.102 వస్తుందని మార్కెట్ వర్గాలు తెలిపారు. కానీ డబ్బు సమస్య కారణంగా దిగుమతిదారులు ఈ నూనెను ఓడరేవుల్లో కిలో రూ.97 ధరకు విక్రయిస్తున్నారు.

ఈ తక్కువ ధరకు విక్రయించడం వల్ల సోయాబీన్ నూనె ధరలు తగ్గుతున్నాయి. మలేషియా ఎక్స్ఛేంజ్ పతనం కాకుండా, అధిక ధరలకు కొనుగోలు చేయకపోవడంతో సీపీఓ, పామోలిన్ ఆయిల్ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

ఈ నూనెల ధరలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయని, వాస్తవానికి కొనుగోలుదారుల కొరత చాలా ఎక్కువగా ఉందంటున్నారు మార్కెట్ వర్గాలు.మలేషియాలో పామ్, పామోలిన్ ఆయిల్‌పై దిగుమతి సుంకం ధరలలో హెచ్చుతగ్గుల గురించి మన చమురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే నూనె-నూనె గింజల ఉత్పత్తిని పెంచడం అసాధ్యం. తలసరి ఎడిబుల్ ఆయిల్ వినియోగం చాలా తక్కువగా ఉన్నందున ఎడిబుల్ ఆయిల్ ధర స్వల్పంగా పెరిగితే బడ్జెట్ చెడిపోతుందనే అపోహ క్రియేట్ చేశారన్నారు.

అందుకు భిన్నంగా ఏళ్ల తరబడి స్తబ్దుగా ఉన్న ధరలతో సతమతమవుతున్న ఎడిబుల్ ఆయిల్ ధరల పెంపునకు శ్రీకారం చుట్టడం వల్ల నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతులను పురికొల్పడంతోపాటు దేశంలోని విలువైన విదేశీ మారకద్రవ్య వ్యయాన్ని తగ్గించవచ్చు.ఆవాలు నూనె గింజలు ? క్వింటాల్‌కు రూ. 6,550-6,600. వేరుశనగ ? క్వింటాల్‌కు రూ. 5,850-6,175. వేరుసెనగ నూనె మిల్లు డెలివరీ (గుజరాత్) ? క్వింటాల్‌కు రూ. 13,850. వేరుశనగ శుద్ధి చేసిన నూనె ? టిన్‌కు రూ. 2,105-2,405. ఆవాల నూనె దాద్రీ ? క్వింటాల్‌కు రూ. 13,550. ఆవాలు పక్కి ఘనీ ? ఒక్కో టిన్ రూ. 2,300-2,400. ఆవాలు కచ్చి ఘనీ ? ఒక్కో టిన్ రూ. 2,300-2,425. నువ్వుల నూనె మిల్లు డెలివరీ ? క్వింటాల్‌కు రూ. 18,900-21,000. సోయాబీన్ ఆయిల్ మిల్లు డెలివరీ ఢిల్లీ ? క్వింటాల్‌కు రూ. 13,500. సోయాబీన్ మిల్ డెలివరీ ఇండోర్ ? క్వింటాల్‌కు రూ. 13,300. సోయాబీన్ నూనె దేగం, కండ్ల ? క్వింటాలుకు రూ.9,650. సీపీఓ మాజీ కండ్ల ? క్వింటాల్‌కు రూ. 12,950. పత్తి గింజల మిల్లు డెలివరీ (హర్యానా) ? క్వింటాల్‌కు రూ. 12,100. పామోలిన్ ఖీఃఆ, ఢిల్లీ ? క్వింటాల్‌కు రూ. 14,200. పామోలిన్ ఎక్స్-కాండ్లా ? క్వింటాల్‌కు రూ. 13,300 (ఊు లేకుండా). సోయాబీన్ ధాన్యం ? క్వింటాల్‌కు రూ.4,400-4,450. సోయాబీన్ లూజ్ ? క్వింటాల్‌కు రూ.4,100-4,200.

# బడ్జెట్ ఆశలు

# రూ.3 లక్షల కోట్లపైనే

న్యూఢిల్లీ, జనవరి 17, (న్యూస్ పల్స్) ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భారత రైల్వేలకు ఒక పెద్ద బహుమతిని ప్రకటించవచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రైల్వేలకు బడ్జెట్‌లో రూ.2.65 లక్షల కోట్లు అందాయని, ఈసారి అది 15 నుండి 18 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భారత రైల్వేలకు ఒక పెద్ద బహుమతిని ప్రకటించవచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రైల్వేలకు బడ్జెట్‌లో రూ.2.65 లక్షల కోట్లు అందాయని, ఈసారి అది 15 నుండి 18 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. రైల్వేలు వేగంగా ఆధునీకరణ అవుతున్నందున, ప్రమాదాలను నివారించడానికి రైల్వేలు కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. 2025 బడ్జెట్‌లో ఈ బహుమతి రైల్వేలకు కూడా ముఖ్యమైనది. 2024 సంవత్సరంలో 70 చిన్న, పెద్ద రైల్వే ప్రమాదాలు జరిగాయి. ఈ బడ్జెట్ రైల్వేలకు ఎలా ప్రత్యేకంగా ఉండబోతుందో తెలుసుకుందాం.2024 తొలి నెలల్లో మూడు పెద్ద రైల్వే ప్రమాదాలు జరిగాయి. వాటిలో జూన్‌లో జరిగిన కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం కూడా ఉంది. ఈ ప్రమాదంలో 17 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఇది కాకుండా గత సంవత్సరంలో 70 కి పైగా రైల్వే ప్రమాదాలు జరిగాయి. ఇది రైల్వేలలో వేగవంతమైన మార్పు అవసరమని చూపిస్తుంది. ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో రైల్వేలకు ప్రత్యేక బహుమతిని ఇవ్వవచ్చు.2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రైల్వేలకు రూ.2.65 లక్షల కోట్లు ఇచ్చారు. ఇందులో రైల్వే ఉద్యోగుల జీతం,పెన్షన్‌తో పాటు భారతీయ రైల్వేల ఆధునీకరణ కూడా ఉంది. రాబోయే బడ్జెట్‌లో భారత రైల్వేల మూలధన వ్యయం 15 నుండి 20 శాతం పెరగవచ్చు. రైల్వేలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 3 లక్షల కోట్లకు పైగా పొందవచ్చు.భారతీయ రైల్వేలు వేగంగా ఆధునీకరించబడుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా అనేక వందే భారత్ రైళ్లు ప్రవేశపెట్టబడ్డాయి. దీనితో పాటు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ప్రారంభమైంది. అదే సమయంలో, రైళ్ల వేగాన్ని పెంచడానికి రైల్వేలు పాత పట్టాలను వేగంగా మారుస్తున్నాయి. దీనితో పాటు, ప్రమాదాలను నివారించడానికి, రైల్వేలు దాని మొత్తం ట్రాక్‌పై షీల్డ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాయి

# కుంభమేళలో పోటెత్తున్న నాగసాధ్వీలు

లక్నో, జనవరి 17, (న్యూస్ పల్స్) ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభం ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ మహా కుంభ్ ఫిబ్రవరి 26న ముగుస్తుంది. ఈసారి 40 కోట్ల మంది భక్తులు గంగా-యమునా, సరస్వతిల త్రివేణి సంగమం వద్ద విశ్వాసం పొందేందుకు దాదాపు 45 రోజుల పాటు జరిగే మహా కుంభం లో పాల్గొంటున్నారు. ఈ త్రివేణి సంగమంలో పుణ్య స్నానం చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సాధువులు, ఋషులు తరలివస్తున్నారు. ఇక ప్రతిసారీ కుంభానికి వచ్చే నాగ సాధువులు ప్రజల్లో సెంటరాఫ్ అట్రాక్షన్‌గా ఉంటారు. నాగ సాధువులు లేకుండా కుంభాన్ని ఊహించలేము. అఘోరీలు, నాగ సాధువులు కుంభమేళాలో చర్చలో ఉండటం కూడా కామన్. నాగ సాధువుల వేషధారణ, ఆహారం సామాన్యులకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. పురుషుల లాగే స్త్రీలు కూడా నాగ సాధువులే. అయితే ఈ సాధ్విల గురించి మనం ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకుందాం.మగ నాగ సాధువుల మాదిరిగానే, ఆడ నాగ సాధ్వి కూడా ప్రాపంచిక అనుబంధాలకు దూరంగా జీవిస్తుంది. ఆమె తన కుటుంబ జీవితాన్ని విడిచిపెట్టి, తన జీవితాంతం భగవంతుని ఆరాధనలో మాత్రమే గడుపుతుంది. వారికి, సంబంధాలు, అనుబంధాలు, డబ్బు, ఆస్తి మొదలైనవి ఎటువంటి ప్రాముఖ్యత ఉండవు. నాగ సాధువులు కావడానికి, మహిళలు దాదాపు 10 నుంచి 15 సంవత్సరాల వరకు బ్రహ్మచర్య ప్రతిజ్ఞను పాటించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సాధ్వి అయ్యే ప్రక్రియ ప్రారంభమవుతుంది. గృహస్థ జీవితాన్ని పూర్తి చేసిన లేదా గృహస్థం చేసుకోని స్త్రీలు మాత్రమే నాగ సాధువులు అవడానికి అవకాశం ఉంటుంది.ఇది మాత్రమే కాదు, కొన్ని కారణాల వల్ల కుటుంబ జీవితాన్ని వదులుకున్న స్త్రీలు నాగ సాధువులుగా మారవచ్చుట. అలాంటి స్త్రీలు తమను తాము భగవంతునికి అంకితం చేసుకున్నారని, కుటుంబ జీవితంలోకి తిరిగి రాలేరని తమ గురువుకు నిరూపించుకోవాలి. అప్పుడు మాత్రమే వారిని సాధువులుగా అంగీకరిస్తారు.మహిళా నాగ సాధువులు కొన్ని పెద్ద అఖారా లేదా ఇతర వాటితో సంబంధం కలిగి ఉంటారు. అయితే, వారికి నివసించడానికి ప్రత్యేక ఆశ్రమం కూడా ఇస్తారు.

వారి ఆశ్రమంలో ఇతర మహిళా సాధ్విలతో కలిసి తన జీవితాన్ని గడుపుతుంటారు. కుంభమేళా సందర్భంగా అఖారాలో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఇది మాత్రమే కాదు. పురుష నాగ సాధువులు కుంభ స్నానం చేసినప్పుడు, ఆ తర్వాత వారు పవిత్ర నది నీటిలో స్నానం చేసి పుణ్యం పొందాలి.ప్రతి రోజు మహిళలు నాగ సాధువులు కావడానికి కఠినమైన సాధన ను అనుసరించాలి. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేచి శివుని జపం చేయాలి. సాయంత్రం పూట దత్తాత్రేయుడిని పూజించాలి. ఇదిలా ఉంటే మధ్యాహ్నం పూట భోలేనాథ్‌ను స్మరించుకోవడం కూడా అవసరం. ఆడ నాగ సాధువులు తమ ఆహారంలో శాఖాహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.

ఇందులో వేరులు, పండ్లు, పువ్వులు, ఆకులు, మూలికలు ఉంటాయి. వారు నూనె, వేయించిన ఆహారాన్ని తినకూడదు.

# సంక్రాంతి బరిలో 3 వేల కోట్ల పందేలు

విజయవాడ, జనవరి 17,తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఓవైపు పిండి వంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, పూజలు, భోగి మంటలు జరుపుకున్నారు. మరోవైపు కోడి పందాలు, గుండాటలతోపాటు అనేక క్రీడా పోటీలు కొనసాగాయి. కోడి పందాలు జరిగిన ప్రాంతాలు మినీ స్టేడియం నే తలపించాయి.

ఎటు చూసినా టెంట్లు, కుర్చీలు, ఎల్ఈడి స్క్రీన్లు, గ్యాలరీలు, కామెంట్రీ లు? ఇలా ఒకటేమిటి అన్ని చిత్ర విచిత్రాలు కొనసాగాయి.ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల్లో కోడి పందాలు కొనసాగాయి. భారీగా బరులు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు రెండు వేల కోట్ల రూపాయల వరకు బెట్టింగ్ కొనసాగినట్లు ప్రచారం నడుస్తోంది.

కోనసీమ నుంచి మొదలుపెడితే రాయలసీమ వరకు పంద్యాలు కొనసాగినట్లు తెలుస్తోంది. సంక్రాంతి తొలి రోజు అయిన భోగినాడు 350 కోట్ల రూపాయల సాగగా? ఆ తరువాత సంక్రాంతి రోజున ఏకంగా 600 కోట్ల రూపాయల బెట్టింగ్ సాగినట్లు తెలుస్తోంది. కనుమ రోజు ఒక్క రోజే వెయ్యికోట్ల పందాలు జరిగినట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క కోడిపందమే రికార్డు స్థాయిలో కోటి 25 లక్షలు పలికినట్లు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం బైబోయిన వెంకటరామయ్య తోటలో భారీగా బెట్టింగ్ సాగినట్లు తెలుస్తోంది. ఏపీలోనే ఇది హైలెట్ అన్నట్లు సమాచారం.

× ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో

ఉమ్మడి తూర్పుగోదావరి( జిల్లాలోని కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 500 కోట్ల రూపాయల మేర బెట్టింగ్ సాగినట్లు ప్రచారం నడుస్తోంది. కోడిపందాలతో సమానంగా గుండాట కూడా నడిచింది.

ప్రధానంగా కాకినాడ జిల్లాలో మూడు రోజుల్లో 250 కోట్లకు పైగా పందాలు జరిగినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో 150 కోట్లు, కోనసీమ జిల్లాలో 100 కోట్లు సాగగా.. గుండాట రూపంలో మరో 50 కోట్ల రూపాయలు బెట్టింగులు సాగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 500 కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది.

× కాకినాడ జిల్లాలో

కాకినాడ జిల్లాలో గుండాట వ్యాపారులకు కాసులు పంట పండించినట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు గుండాట బోర్డులను ఏర్పాటు చేశారట. అక్కడ లక్షల్లో లావాదేవీలు జరిగాయట. ప్రత్తిపాడు మండలంలోని ఓ గ్రామంలో సంక్రాంతి మూడు రోజులు కలిపి ఓ గుండాట నిర్వాహకుడు ఏకంగా కోటి 20 లక్షల బిజినెస్ సాగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఓ వ్యాపారి అయితే 25 లక్షల రూపాయలు సంపాదించినట్లు తెలుస్తోంది. మురమళ్ళ, కరప లో సైతం భారీగా గుండాట సాగినట్లు సమాచారం.

× ఉమ్మడి కృష్ణాజిల్లాలో

ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోడిపందాలు, పేకాట శిబిరాలు భారీగా నడిచినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దు అయిన జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్ వరకు బరులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాగిన కోడిపందాలలో 400 కోట్ల రూపాయలు చేతులు మారినట్లు స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో పందెం లక్ష నుంచి 7 లక్షల వరకు సాగినట్లు తెలుస్తోంది. వీఐపీ వరుణ్ లో అయితే మూడు నుంచి ఐదు లక్షలకు పైగానే పందాలు కాసినట్లు స్థానికులు చెబుతున్నారు.

మొత్తానికి అయితే కోడిపందాల రూపంలో దాదాపు రెండు వేల కోట్ల రూపాయలు బెట్టింగ్ జరగడం విశేషం.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు
## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు గంగసాగరం వద్ద అర్ధరాత్రి 12.15 గం.లకు. జరిగిన రోడ్డు ప్రమాద ఘటన లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.అర్ధరాత్రి సంఘటన జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుల తరలింపు వైద్య సేవల నిమిత్తం సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసారు. సంఘటన స్థలం లో అర్ధరాత్రి సమయం లెక్క చేయక చిత్తూరు ప్రభుత్వాసుప్రతి కి వచ్చి క్షత గాతులతో మాట్లాడి స్వయం గా వైద్యులు కు వైద్య సేవలు నిమిత్తం తగు సూచనలు జారీ చేసి తెల్లవారు జామున 3 గం.ల వరకు హాస్పిటల్ నందు ఉండి స్వయంగా పర్యవేక్షించారు.

# నత్తనడకన మానేరు రివర్ ఫ్రంట్ పనులు

కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి: జనవరి 17, జిల్లాల పునఃర్విభజనతో చారిత్రక, పర్యాటక ప్రాధాన్యతను కోల్పోయిన కరీంనగర్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం మానేర్ రివర్ ఫ్రంట్ మంజూరు చేసింది. 470 కోట్లు మంజూరు చేసి మానేర్ తీరాన్ని మరో సబర్మతిలా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందించింది. మానేర్ వాగులో బోటింగ్, థీమ్ పార్క్, ఎల్ఎండీలో కేసీఆర్ ఐలాండ్ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. రివర్ ఫ్రంట్ పనులు చేపట్టి ఏడాది లో పూర్తి చేయాలని సంకల్పించారు. అంతలోనే ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో మణిహారం అనుకున్న మానేర్ రివర్ ఫ్రంట్ పనులు మరుగునపడ్డాయి.మానేర్ నది ప్రధాన గేట్ల దిగువన దాదాపు 3 కి.మీ మేర నిర్మించే మానేర్ రివర్ంట్ ఫ్రంట్ పనుల ప్రగతిలో ఆరంభ శూనత్వమనేది స్పష్టంగా కనిపిస్తోంది. దాని నిర్మాణానికి రూ.470 కోట్లను వెచ్చించాలనుకున్నారు. నీటిపారుదల, పర్యాటక శాఖలు నిర్మాణ బాధ్యతలు చేపట్టాయి. ఇరువైపులా మట్టి, రాళ్లను నింపే పని మాత్రమే పూర్తయింది. మొదటి దశ పనుల్లో భాగంగా దాదాపు 74 శాతం పని పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం రూ. 201 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది మే నాటికి ఈ మొదటి దశ పనులు పూర్తికావాల్సి ఉండగా.. వచ్చే ఏడాది నాటికి కొలిక్కి వచ్చే వీలుంది.మానేర్ డ్యామ్ గేట్ల నుంచి చేగుర్తి వరకు ఐదు చెక్ డ్యామ్ లు నిర్మించి 12 ఫీట్ల వరకు నీటి నిల్వచేసి ఓటింగ్ ఏర్పాటు చేయాలని మానేర్ రివర్ ఫ్రంట్ లక్ష్యం. ఈ చెక్ డ్యామ్ లు ఆరు నెలల కిందటే పూర్తి చేయాలి. సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఇనుప చువ్వలు ఉండిపోయాయి. పిల్లర్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టాల్సి ఉంది. మొత్తంగా 15 ఫిల్లర్లలో ఒకదాన్ని మాత్రం సిమెంట్ తో నిర్మించి వదిలేశారు. దీన్ని పూర్తి చేస్తేనే పర్యాటకుల ఆహ్లాదానికి అవకాశం ఉంటుంది. పైగా ఇరువైపులా నిర్మించిన మట్టి కట్టలో ఒకవైపు 32 బ్లాక్స్ పూర్తి కాగా, మరో వైపు ఇంకా సగం మట్టి, రాళ్లు నింపాల్సి ఉంది.ఇటీవల మళ్లీ మిగులు పనుల కోసం రూ.234 కోట్లు విడుదలయ్యాయి. వీటితో రెండో దశ పనులను చేపట్టబోతున్నారు. గతంలో నిర్మించకుండా వదిలేసిన మురుగు, వరదకాలువల కోసం రూ.60 కోట్లు వెచ్చించబోతున్నారు. మిగతా మొత్తాన్ని చెక్ డ్యామ్ నిర్మాణంతోపాటు మిగతా నింపాల్సిన మట్టి, రాళ్ల కోసం వెచ్చిస్తారు. మొదట్లో ఈ రివర్ ఫ్రంట్ పనుల అంచనా రూ. 410 కోట్లు అని ప్రారంభించగా.. తర్వాత ఈ వ్యయం విలువ రూ.470 కోట్లకు చేరింది. ఈ నిధులు పూర్తి స్థాయి పనులకు సరిపోవనేది స్పష్టమవుతోంది. ఫౌంటెయిన్ నిర్మాణంతోపాటు పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన వాటికి కూడా నిధులు అవసరమవుతాయినగరంలో నుంచి వెలువడే మురుగంతా.. మానేరు రివర్ంట్ లోకే వెళ్తుంది. రాంపూర్, అంబేద్కర్ మైదానం, శనివారం మార్కెట్ ప్రాంతాల నుంచి ఉన్న నాలాలన్నీ ఇందులో కలుస్తాయి. వాస్తవానికి ఇరువైపులా కట్టను నిర్మించడానికి ముందుగానేపాత వంతెన నుంచి తీగల వంతెన అవతలి వరకు మురుగు, వాన నీరు వెళ్లే కాలువ నిర్మించాలి. అలా చేయకుండానే మట్టి, రాతికట్టడాలను నిర్మించడంతో ఇబ్బంది నెలకొంది. మురుగును శుద్ధి చేయకుండానే మానేరులోకి వదిలితే పరివాహక ప్రాంత రైతులకు.. పర్యాటకులకు వాసన ముప్పు తప్పదు. కరీంనగర్, సదాశివపల్లి, అలుగునూర్ల నుంచి వెలువడే వ్యర్థాల విషయంలో అవసరమైన మార్పులు చేపట్టాలి.మానేర్ వాగుపై హౌజింగ్ బోర్డు కాలనీ నుంచి సదాశివ్ పల్లి వరకు అర కిలోమీటర్ పొడవునా 183 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మించారు. కొద్ది రోజులు వినోదం కార్యక్రమాలు నిర్వహించారు. అనతి కాలంలోనే కేబుల్ బ్రిడ్జిపై తార్ కొట్టుకుపోయింది. నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. జిగేల్ మనిపించిన లైట్లు వెలగక చీకట్లు అలుముకున్నాయి. కేబుల్ దొంగలు ఎత్తుకెళ్లారు. రెండు కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.దీనిపై కాంగ్రెస్ గతంలో ఆందోళనకు దిగి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో విచారణ చేపట్టి కాంట్రాక్టర్ నుంచి రెండు కోట్ల వరకు రికవరీ చేసే పనిలో నిమగ్నమయింది. ప్రస్తుతం ఆర్ఎంపి పర్యవేక్షణలో తీగల వంతెన ఉండగా దాన్ని నగరపాలక సంస్థకు లేదా సుడాకు అప్పగించే సన్నాహాలు జరుగుతున్నాయిమరోవైపు మానేర్ తీరాన డంపింగ్ యార్డ్ పెద్ద సమస్యగా మారింది. డంపింగ్ యార్డ్ వేరే ప్రాంతానికి షిఫ్ట్ చేయాలని నిర్ణయించినా ఇప్పటికీ ఎక్కడ సరైన స్థలం దొరకక్క అక్కడే డంపింగ్ యార్డ్ చెత్తను శుద్ధిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు 16 కోట్ల 50 లక్షలు ఖర్చు చేశారు. అది ఇప్పుడు పాలకుల చిత్తశుద్ధిని వేలెత్తి చూపుతూ రావణా కాష్టంలా మండుతూ పొగతో స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. పొగతో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని డంపింగ్ యార్డ్ ను వెంటనే వేరే ప్రాంతం తరలించాలని స్థానికులు కోరుతున్నారు. మానేర్ రివర్ ప్రంట్ లో భాగంగా తక్షణమే డంపింగ్ యార్డ్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.మానేర్ రివర్ ఫ్రంట్ పనుల జాప్యానికి గత పాలకులే కారణమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. నాణ్యతా లోపంతో పనులు చేపట్టి అవకతవకలకు పాల్పడడమే కారణం అంటున్నారు. విచారణ జరిపించి బాద్యుల నుంచి డబ్బులను రికవరీ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రణాళికబద్ధంగా మానేర్ రివర్ ఫ్రంట్ పనులను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని నరేందర్ రెడ్డి చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో డ్రైనేజీ కాలువలు తోపాటు నిలిచిపోయిన మానేరు నది ఇరువైపుల నిలిచిపోయిన మట్టి,రాతి కట్ట పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు.

# కేటీఆర్ కు మరో తలనొప్పి



హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: జనవరి 17,ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ అధికారులు దూకుడుగా విచారణ జరుపుతున్నారు. తాజాగా ఏసీబీ అధికారులు కేసులో కీలకంగా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ అనే కంపెనీకి నోటీసులు జారీ చేశారు. ఈ కంపెనీ ఫార్ములా ఈ రేసు కు మొదటి సీజన్ కు స్పాన్సర్ గా వ్యవహరించారు. తర్వాత వైదొలగింది. అందుకే ప్రభుత్వం నుంచి స్పాన్సర్ షిప్ ను చెల్లించాల్సి వచ్చింది. ఏస్ నెక్ట్స్ జెన్ తో పాటు గ్రీన్ కో ఎండీ అనిల్ చలమలశెట్టికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెల 18న విచారణకు కావాలని నోటీసుల్లో పేర్కొంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్ సహా అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ విచారించింది. ఇప్పుడు అనిల్ చలమలశెట్టికి కూడా నోటీసులు ఇవ్వడంతో ఈ కేసును కొలిక్కి తెచ్చేందుకు ఏసీబీ దర్యాప్తు దూకుడుగా జరుపుతోంది. గ్రీన్ కో కంపెనీకి ఏస్ నెక్ట్స్ జెన్ సబ్సిడరీ కంపెనీ. ఇప్పటికే ఈ కేసులో ఆ సంస్థల ఆఫీసుల్లో సోదాలు నిర్వహించారు. కంపెనీ ఏర్పాటు వెనుక ఉద్దేశాలు..స్పాన్సర్ షిప్ నుంచి తప్పుకోవడం అదే సమయంలో బీఆర్ఎస్ కు ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం తదితర అంశాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. త్వరలో కేటీఆర్ కు కూడా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈడీ విచారణ తర్వాత ఏసీబీ అధికారులు కేటీఆర్కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. కేటీఆర్ ను అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి సమక్షంలో విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో అర్వింద్ కుమార్ అప్రూవర్ గా మారతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సుదీర్ఘ సర్వీస్ ఉన్న తాను.. నిబంధనలకు విరుద్దంగా ఏమీ చేయలేదని అంతా కేటీఆర్ చెప్పినట్లుగానే చేశానని.. చెబుతున్నారు. అదే క్రమంలో జరిగిన వివరాలన్నీ చెబుతానని తనను అరెస్టు చేయవద్దని ఆయ కోరుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో డబ్బులు చెల్లించక ముందు ఎలాంటి ఒప్పందం లేదు. డబ్బులు చెల్లించిన తర్వాతనే ఒప్పందాలు చేసుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏస్ నెక్ట్స్ జెన్ స్పాన్సర్ షిప్ ఉపసంహరించుకోవడం కూడా కుట్రపూరితం అన్న అనుమానాలు రావడంతో ఆ దిశగా కూడా ఏసీబీ దర్యాప్తు జరుపుతోంది. ఎఫ్ఐఆర్ ను క్వాష్ చేసేందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించడంతో కేటీఆర్ ను అరెస్టు చేయడానికి ఎలాంటి ఆటంకాలు లేవు. అయితే ఈ వ్యవహారంలో అందర్నీ పూర్తి స్థాయిలో ప్రస్నించిన తర్వాతనే అరెస్టుల గురించి ఏసీబీ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# కొత్తగూడెనికి ఎయిర్ పోర్టు

ఖమ్మం, పజాబలం ప్రతినిధి జనవరి 17, తెలంగాణలో రానున్న రోజుల్లో మరిన్ని విమానాశ్రయాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు.. ఇప్పటికే హైదరాబాద్ మినహా ముఖ్యమైన నగరాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా.. కొత్తగూడెం ఎయిర్ పోర్టుకు సంబంధించిన కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం నుంచి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది.కొన్ని రోజుల క్రితమే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ లో నిర్మించాలని భావిస్తున్న మామునూరు ఎయిర్ పోర్టు భూసేకరణ, ప్రాజెక్టు వివరాలు, నిర్మాణాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరంగా ఉన్న వరంగల్ కు విమాన సర్వీసుల్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. తాజాగా.. భద్రాది కొత్తగూడెం జిల్లాలోనూ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయిరాష్ట్ర ప్రభుత్వ కోరడంతో.. గతంలో కొత్తగూడెం ప్రాంతంలో పర్యటించిన కోసం ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) అధికారులు అక్కడ ఎయిర్ పోర్ట్ నిర్మించాలని భావిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఫీజిబిలిటీ సర్వే సానుకూలంగా రాకపోవడంతో విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫీజిబిలిటీ సర్వేలో వివిధ అంశాలను నిపుణులు పరిశీలిస్తుంటారు. ఎయిర్ పోర్టు నిర్మిస్తున్న ప్రాంతం.. దగ్గర్లోని ఎయిర్ పోర్టుల నుంచి రాకపోకల సాధ్యాసాధ్యాలు, విమానాశ్రయ నిర్మాణానికి అయ్యే ఖర్చు, వినియోగించాల్సిన సాంకేతికతలు, ఇతర ఆర్థికపరమైన అంశాలను పరిగణలోకి తీసుకుని విశ్లేషిస్తుంటారు. ఈ పరీక్షల్లో సానుకూల ఫలితాలు రాకుంటే.. ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగదు. కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్ పోర్టు రావడం వల్ల ఆ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అక్కడ ఎయిర్ పోర్టు నిర్మించాలని గట్టిగా పట్టుబడుతోంది. ఈ నేపత్యంలోనే.. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిశారు. కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను మరోసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. అధికారులను ఆదేశించడంతో, అక్కడ ఎయిర్పోర్ట్ ఏర్పాటుపై ఏఏఐ దృష్టి సారించింది.ఏఏఐ నుంచి నిపుణులు వచ్చి సంబంధిత ప్రాంతంలో ఫీజిబిలిటీ పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాల్సిందిగా.. రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. వెనువెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర సంస్థ కోరిన రూ.37.87 లక్షలను విడుదల చేసింది. దీంతో..ఎయిర్పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందం ఈ నెల 20న కొత్తగూడెంలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎయిర్ పోర్టు నిర్మించాలని భావిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.

ఈ మేరకు.. తాజాగా తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ బృందం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించి విమానాశ్రయ ఏర్పాటుకు కావాల్సిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ పరీక్ష, సాయిల్ టెస్టింగ్తో పాటు ఇతర సాధ్యాసాధ్యాలను పరిశీలించి, నివేదిక రూపొందించనుంది.కేంద్ర ప్రభుత్వ అధికారులు, నిపుణుల పర్యటన నేపథ్యంలో.. కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ తదితర ప్రాంతాల్లోని 950 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. ఈ భూముల్లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుకూలంగా ఫీజిబిలిటీ టెస్ట్ ఫలితాలు వస్తే.. భూసేకరణ చేసి విమానాశ్రయ నిర్మాణాన్ని సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని భావిస్తున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్..

కడప స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో.. శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పర్యటనా ఏర్పాట్లను పరిశీలించారు. మైదుకూరు కోర్టు సముదాయం సమీపంలోని హెలిప్యాడ్, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగే ఫంక్షన్ హాలు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా స్వచ్ఛ మైదుకూరులో పారిశుధ్యంపై ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ తో ర్యాలీ నిర్వహించే నలుగురోడ్ల కూడలి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముఖ్యమంత్రి సభ, గ్యాలరీ, స్టాళు ఏర్పాట్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట.. తెదేపా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి పర్యటనల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ (మాజీ శాసనసభ్యులు), ఏఎస్పీ కె. ప్రకాష్ బాబు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీవోలు చంద్ర మోహన్, సాయిశ్రీ, కేఎంసి కమిషనర్ మనోజ్

# వేగంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ

హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: జనవరి 16, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు సర్వే పూర్తి కావొచ్చింది. గ్రామసభల ద్వారా అర్హుల జాబితాలను సిద్ధం చేస్తారు. అయితే ఈ జాబితాలకు జిల్లా ఇంఛార్జ్ మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది.తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో ఉన్న సర్వేయర్లు వివరాలను సేకరిస్తున్నారు. దాదాపు సర్వే పూర్తి కావొచ్చింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ లో ప్రతిదీ ఎంట్రీ చేస్తున్నారు. మరోవైపు లబ్ధిదారుల ఎంపిక దిశగా కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేయనున్నారు. రానున్న నాలుగేళ్లలో అర్హులందరికీ గృహాలను నిర్మించే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మొత్తం రూ. 5 లక్షలు ఇస్తారు. ఈ డబ్బులను నాలుగు దశల్లో విడతల వారీగా లబ్ధిదారుడి ఖాతాలో వేస్తారు. అయితే లక్షల సంఖ్యలో దరఖాస్తులు ఉండటంతో.. అసలైన అర్హులను గుర్తించటం ప్రభుత్వానికి సవాల్ గా మారిందనే చెప్పొచ్చు. సర్వేలో పథకానికి ఎంపికయ్యే అర్హతలు ఉన్న దరఖాస్తుదారుడిని గుర్తిస్తారు. గ్రామాల వారీగా పేర్లు ఖరారవుతాయి. వీరి వివరాలను ఇందిరమ్మ కమిటీలు పరిశీలించే అవకాశం ఉంది. అంతేకాకుండా? ఈ జాబితాను గ్రామసభ ముందుంచి? ఆమోదముద్ర వేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామసభలు కీలకంగా పని చేయనున్నాయి. ఇంతటంతో కాకుండా? ఎంపికైన జాబితాను ఇంచార్జీ మంత్రికి అందించాల్సి ఉంటుంది. ఆపై ఇంఛార్జీ మంత్రి ఆమోదం కూడా తప్పనిసరి చేశారు. ఇదే విషయాన్ని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి కూడా వెల్లడించారు.ఈ జాబితాలకు ఇంఛార్జీ మంత్రి ఆమోదం తర్వాత.. ఈ లిస్టులు జిల్లా కలెక్టర్ వద్దకు చేరుతుంది. జిల్లా కలెక్టర్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే జాబితాలు విడుదలవుతాయి.వీరే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అవుతారు.ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలు... పీఛే మూడ్

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:జనవరి 17, తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయాల్లో మార్పు కనిపించింది. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇలా చేరిన వారిని బీఆర్ఎస్ హైకమాండ్ కు అత్యంత సన్నిహితులైన వారు ఉన్నారు. అదే సమయంలో ఇంకా చాలా మంది చేరేందుకు సిద్ధంగా ఉన్నారని గతంలో కేసీఆర్ చేసినట్లుగా బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుంటారన్న ప్రచారం జరిగింది. కానీ ఫిరాయింపుల నెంబర్ పది మందితోనే ఆగిపోయింది. ఇప్పుడు చేరిన ఆ పదిమందిలోనూ కొంత మంది వెనక్కి వెళ్తునారన్న ప్రచారం ఊపందుకుందిదానం నాగేందర్ కాంగ్రెస్ కు మెల్లగా దూరమవుతున్నారని ఆయన మాటల్ని బట్టి రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి కిషన్ రెడ్డికి గట్టిపోటీ ఇచ్చారు. అయితే తనకు కాంగ్రెస్ సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని అనుకుంటున్నారు. అసలు పట్టించుకోవడంలేదన్న ఉద్దేశంతో మళ్లింది కొత్త కొత్త ప్రకటనలు ప్రారంభించారు. కేటీఆర్ ప్రకటనలను సమర్థిస్తూ మీడియాతో మాట్లాడుతున్నారు. ఫార్ములా ఈ రేసు వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని.. అందుకే తాము నిధులు మంజూరు చేశామని కేటీఆర్ చెబుతున్నారు. ఇదే వాదనను దానం నాగేందర్ సమర్థించారు. పార్ములా ఈ వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందన్నారు. అదే సమయంలో హైడ్రా పై కూడా నాగేందర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.దీని వల్ల ప్రజలకు.. హైదరాబాద్కు చాలా నష్టం జరుగుతోందన్నారు. యూట్యూబ్ చానళ్లకు ఇంటర్యూలు ఇస్తూ ఆయన కొన్ని వ్యాఖ్యలు చేస్తున్నారు. అసెంబ్లీలో కేటీఆర్ పై బూతులు మాట్లాడిన వైనం, హెచ్చరించిన వైనం తప్పేనని.. ఆ విషయంలో తాను కేటీఆర్ ను వ్యక్తిగతంగా కలిసి క్షమాపణలు చెప్పానని అంటున్నారు. దానం నాగేందర్ తీరు చూస్తే.. ఏదో తేడాగా ఉందన్న అభిప్రాయానికి కాంగ్రెస్ నేతలు వస్తున్నారు. గద్వాల నుంచి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ తో మళ్లీ టచ్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరికను కాంగ్రెస్ క్యాడర్ వ్యతిరేకించింది. పార్టీలో చేరిన తర్వాత కూడా ఎవరూ ఆయనను కలిసేందుకు రాలేదు. చివరికి ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన సరితా తిరుపతయ్య కూడా ఆయన కాంగ్రెస్ లో చేరేందుకు అంగీకరించలేదు. వీరెవరినీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం సముదాయించలేదని.. కాంగ్రెస్ లో ఇమడలేని పరిస్థితులు కల్పిస్తున్నారని బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భావిస్తున్నారు. అప్పట్లోనే మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయనతో చర్చించి.. రాజకీయంగా హడావుడి నిర్ణయాలు తీసుకుని నష్టపోవద్దని నచ్చచెప్పారు. కారణం ఏదైనా పది మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు కాంగ్రెస్ లో చేరిపోయారు.ఇప్పుడు వారు అధికార పార్టీగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ తమకు ఇచ్చిన హమీలు నెరవేర్చినా నెరవేర్చకపోయినా.. అధికార పార్టీ ఎమ్మెల్యే అనే హోదా మాత్రం ఉంటుంది. ఈ కారణంగా ఎమ్మెల్యేలు వెనక్కి వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపించరని అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ తమ ఎమ్మెల్యేలు వెనక్కి వస్తున్నారని ప్రచారం చేసుకుంటున్నారు కానీ అది జరగదని అంటున్నారు.పైగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మరికొంత మంది ఎమ్మెల్యేలు త్వరలోనే వచ్చి కాంగ్రెస్ లో చేరుతారని అంటున్నారు.

# కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ఎలా అంటే

నల్గొండ ప్రజాబలం ప్రతినిధి:జనవరి 17, తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల మంజూ రుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులు జారీ కానున్నాయి. లక్షలాది కుటుంబాలు ఎంతో కాలంగా కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. దీంతో కొత్త కార్డుల జారీ దిశగా సర్కారు ముందడుగు వేసిందిమంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు అనుగుణంగా కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది.దరఖాస్తులను నిశితంగా పరిశీలించిన తర్వాత.. కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్కు పంపిస్తారు.మండల స్థాయిలో ఎంపీడీవో, యూఎల్బీలో మున్సిపల్ కమిషనర్ ఈ ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారు..ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శిస్తారు. లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారు.ఆహార భద్రత కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, మార్పులు జరగనున్నాయి. అర్హత కలిగిన కుటుంబాలకు ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నారు.రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే.. ముందుగా దరఖాస్తు ఫారమ్ నింపాలని అధికారులు ప్రాథమికంగా చెబుతున్నారు. దరఖాస్తు ఫారం మీసేవా కేంద్రంలో లేదా మీసేవా అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంటుందని అంటున్నారు.మీసేవా సర్వీస్ ఫారమ్లపై క్లిక్ చేస్తే.. అక్కడ వివిధ విభాగాల ఫారంలు కనిపిస్తాయి. అప్పుడు పౌర సరఫరాల శాఖ ఎంపికపై క్లిక్ చేయాలి..ఆహార భద్రతా కార్డ్ కోసం దరఖాస్తు ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. దరఖాస్తు ఫారమ్ను డౌన్లోడ్ చేసిన తర్వాత.. ప్రింట్ అవుట్ తీసుకోవాలి.దరఖాస్తుదారు పేరు, వయస్సు, లింగం, తండ్రి, పేరు, చిరునామా వివరాలతో సహా.. మొబైల్ నంబర్, అవసరమైన అన్ని సమాచారాన్ని దరఖాస్తు ఫారమ్లో పూరించాలి. అర్హత వివరాలు, జిల్లా, ప్రాంతం, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబం ఆదాయం మొదలైన వివరాలు నమోదు చేయాలి..అన్ని పత్రాలను జతచేసి, దరఖాస్తు ఫారమ్ను నిర్ణీత రుసుముతో మీసేవా కేంద్రంలో సమర్పించాలి. అక్నాలెడ్జ్ స్లిప్ తీసుకోవడం మర్చిపోవద్దు. దరఖాస్తు చేయడానికి.. నివాస రుజువు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, దరఖాస్తుదారుడి పాస్పోర్ట్ సైజు ఫోటో అవసరం ఉంటుందని అధికారులు ప్రాథమికంగా చెప్పారు. దీంట్లో ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసే అవకాశం కూడా ఉంది.

# సినిమా





## బోల్డ్ కన్నన్‌గా అలరిస్తున్న ఏస్





'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి లీడ్ రోల్ నటిస్తున్న 'ఏస్' స్పెషల్ గ్లింప్స్ విడుదలైంది. అరుముగకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, యోగి బాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లు, రాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. కరణ్ భగత్ రౌత్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ పవర్‌ఫుల్ మ్యూజిక్‌తో 'ఏస్' గ్రేట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇచ్చింది. 7సిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అరుముగకుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా టైటిల్ టీజర్ విడుదలైన వెంటనే సంచలనం సృష్టించింది, మిలియన్ల వ్యూస్ సంపాదించి రికార్డులు సృష్టించింది. ఇప్పుడు విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా, టీం ఈ ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో విజయ్ సేతుపతి 'బోల్డ్ కన్నన్'గా సాంప్రదాయ తమిళ దుస్తులు ధరించి, మలేషియాలోని విమానాశ్రయంలో డైనమిక్ గా నడుస్తూ, హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలలో పాల్గొంటూ, ఫెస్టివల్‌లో డ్యాన్స్ చేస్తూ కనిపించడం అలరించింది.

# నెవర్ బిఫోర్ రికార్డుల సంక్రాంతి



సంక్రాంతికి ప్రతిసారీ మూడు నాలుగు సినిమాలు రిలీజ్ కావడం మామూలే. కానీ వాటిలో ఒకటి రెండు మంచి టాక్ తెచ్చుకుని దూసుకెళ్తాయి. మిగతావి బోల్తా కొడుతుంటాయి. సంక్రాంతికి 100 పర్సంట్ సక్సెస్ రేట్ చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. 2017లో ఆ అరుదైన దృశ్యమే చూశాం. ఖైదీ నంబర్ 150, గౌతమీపుత్ర శాతకర్ణి, శతమానం భవతి చిత్రాలు మూడూ పాజిటివ్ టాక్ తెచ్చుకుని మంచి వసూళ్లు సాధించాయి. దానికి ముందు, తర్వాత ఎప్పుడూ సంక్రాంతికి 100 పర్సంట్ సక్సెస్ చూడలేదు. ఐతే ఈ ఏడాది రిలీజైన మూడు సినిమాల్లో ఏదీ పూర్తి నెగెటివ్ టాక్ తెచ్చుకోకపోవడం విశేషం. మూడు చిత్రాలకూ ఓపెనింగ్స్‌కు ఢోకా లేదు. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ దిశగా దూసుకెళ్తుండగా.. 'డాకు మహారాజ్' సూపర్ హిట్ దిశగా అడుగులు వేస్తోంది. యావరేజ్ టాక్‌తో మొదలైన 'గేమ్ చేంజర్' పడుతూ లేస్తూ సాగుతోంది. ఆ చిత్రానికి నష్టాలు తప్పవు కానీ.. ఫ్లాప్ అనే పరిస్థితి అయితే లేనట్లే కనిపిస్తోంది. ఇప్పటిదాకా సంక్రాంతికి ఎన్నడూ జరగని ఓ ఘనత ఈసారి సాధ్యమవుతుండడం విశేషం. తెలుగు నుంచి రిలీజైన మూడు చిత్రాలూ వంద కోట్ల గ్రాస్ కలెక్షన్ల క్లబ్బులోకి అడుగు పెడుతున్నాయి. 'గేమ్ చేంజర్' తొలి రోజే ఈ మార్కుకు చేరువగా వెళ్లింది. ప్రస్తుతం కలెక్షన్లు రూ.200 కోట్ల మార్కుకు చేరువగా ఉన్నాయి. 'డాకు మహారాజ్' విడుదలైన నాలుగో రోజు వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టింది. 'సంక్రాంతికి వస్తున్నాం' తొలి రోజే రూ.45 కోట్లు కొల్లగొట్టింది. రెండో రోజుకు వసూళ్లు రూ.80 కోట్లకు చేరుకున్నాయి. ఈ రోజు ఈ చిత్రం వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టడం లాంఛనమే. దేని టాక్ ఎలా ఉంది, అంతిమంగా ఎలాంటి ఫలితాన్ని అందుకోబోతున్నాయి అన్నది పక్కన పెడితే.. తెలుగులో ఈ పండక్కి రిలీజైన ప్రతి సినిమా వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టడం టాలీవుడ్ బాక్సాఫీస్ స్టామినాను ప్రపంచానికి చాటి చెప్పేదే. మొత్తంగా ఈ సంక్రాంతికి టాలీవుడ్ బాక్సాఫీస్ రూ.500 కోట్లకు పైగా బిజినెస్ చేసేలా కనిపిస్తుండడం విశేషం.

## సైఫ్ అలీఖాన్‌పై దాడి..
## తెలిసిన వ్యక్తే..?




బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడికి ఒక్కరే కారణమని, అతను ముందు నుంచి ప్లాన్ చేసుకుంటున్న వ్యక్తి కావచ్చని, ఎవరో తెలిసిన వ్యక్తి కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.దాడి చేసిన వ్యక్తి ఎవ్వరికీ చిక్కకుండా జారుకున్నాడు అంటే అతనికి ముందు నుంచే సైఫ్ ఇంటి గురించి తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇక డైరెక్ట్ గా సైఫ్ కుమారుడు తైమూర్ రూమ్ వద్దకి ఎందుకు వెళ్లారు అనేది మరో ప్రశ్న?. అప్పుడే ఆగంతకుడిని అడ్డుకున్న సైఫ్‌తో జరిగిన పెనుగులాట సమయంలో ఈ దాడి చోటుచేసుకుంది. దాడి అనంతరం అంత ఈజీగా దుండగుడు ఎలా పారిపోతాడు అనేది మరొక మిస్టరీగా మారింది. వేలాది కోట్ల ఆస్తిపరుడైన సైఫ్ కు సెక్యూరిటీ కూడా బలంగానే ఉంటుంది. ఇక అలాంటిది అంత తేలిగ్గా అతను ఎలా బయటపడ్డాడు అనేది అందరిలో మెదులుతున్న ప్రశ్న. ఇక సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు, తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో దుండగుడు కత్తితో దాడి చేశాడని నిర్ధారించారు. అయితే, దాడికి ముందు ఎవరు సొసైటీకి వచ్చిన రికార్డులు లేవు, దాంతో దుండగుడు అప్పటికే సొసైటీ లోపలే ఉన్నాడన్న అనుమానం ఉద్భవించింది. గార్డులు ఎవరినీ అనుమానాస్పదంగా చూడలేదని చెప్పడం ఈ అనుమానాలను మరింత పెంచింది. ప్రస్తుతం సైఫ్ సిబ్బందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సైఫ్ కుటుంబం విషయానికి వస్తే, ఘటన సమయంలో ఆయన భార్య కరీనా కపూర్, కుమారుడు తైమూర్ ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారని ధృవీకరించారు. సైఫ్ మెడ, వెన్నుపక్కన తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే శస్త్రచికిత్స ఒకటి పూర్తి కాగా, ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు. సైఫ్ అలీఖాన్, బాలీవుడ్‌లో ప్రముఖ నటుడిగా మాత్రమే కాకుండా, తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడే. ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్'లో రావణాసురుడిగా, ఎన్టీఆర్ నటించిన 'దేవర'లో భైరవ పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఘటనపై ఎన్టీఆర్, చిరంజీవి కూడా స్పందించారు.

# ఇంతకన్నా ఏం కావాలయ్యా



సినిమాల్లో నటించడం ద్వారా డబ్బు సంపాదించవచ్చేమో కానీ నటీనటులు అంతకన్నా ఎక్కువగా కోరుకునేది పేరు ప్రతిష్టలు, అభిమానుల ప్రేమ. ఇవి ఇచ్చే ఆనందం ఇంకేవి అందివ్వలేవు. ఈ రోజు బ్రహ్మా ఆనందం టీజర్ రిలీజ్ వేడుకలో కమెడియన్ వెన్నెల కిషోర్ కు గొప్ప ప్రశంస దక్కింది. వెయ్యికి పైగా సినిమాల్లో నటించి లెజెండరీ హాస్య నటుడిగా, ఇప్పటితరం మీమ్స్ దేవుడిగా కొలవబడుతున్న బ్రహ్మానందం గారు నా లెగసీని కొనసాగించే వాళ్లలో వెన్నెల కిషోర్ ఉన్నాడని సభా సాక్షిగా చెప్పడం కన్నా ఆనందం ఏముంటుంది. ఇంత ఓపెన్ గా బ్రహ్మి పొడిగారంటే మాములు విషయం కాదు. కొన్నేళ్లుగా దాదాపు ప్రతి నోటెడ్ సినిమాలో పాత్రలు దక్కించుకుంటున్న వెన్నెల కిషోర్ బ్రహ్మా ఆనందంలో బ్రహ్మానందంతో పాటు వాళ్ళబ్బాయి గౌతమ్ తో కలిసి స్క్రీన్ పంచుకున్నాడు. టీజర్ కాన్సెప్ట్ ఫన్నీగా ఆసక్తికరంగా ఉంది. ఇందులో భాగంగానే పైన చెప్పిన ప్రశంసల జల్లు కురిసింది. ఇటీవలే హీరోగా కూడా మారిన వెన్నెల కిషోర్ ఆ మధ్య చారి 111 అనే స్పై డ్రామా చేశాడు. ఆడలేదు కానీ థియేటర్ దాకా వెళ్లిందంటే తన ఇమేజ్ పుణ్యమే. గత నెల శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ లో తనది మెయిన్ క్యారెక్టర్ కాకపోయినా నిర్మాతలు కిషోర్ బ్రాండ్ మీద పోస్టర్లు వేసి మార్కెటింగ్ చేసుకున్నారు. అగ్ర హీరోల నుంచి చిన్న దర్శకుల దాకా అందరికీ మంచి ఛాయస్ అవుతున్న వెన్నెల కిషోర్ నిజంగానే బ్రహ్మానందం లెగసిని కంటిన్యూ చేయడానికి బోలెడు కెరీర్ చేతిలో ఉంది. ఇంతకు ముందులా ఇప్పటి రచయితలు సెపరేట్ గా కామెడీ ట్రాక్స్ రాయడం లేదు. హీరో హీరోయిన్లతోనే పాటు పక్కనున్న ఫ్రెండ్స్ తో పని కానిస్తున్నారు. అయినా కూడా వెన్నెల కిషోర్ కు అవకాశాలు దక్కుతున్నాయంటే తన టైమింగే కారణం. అన్నట్టు గతంలో వెన్నెల కిషోర్ డైరెక్ట్ చేసిన సినిమాలో బ్రహ్మానందం కూడా ఉన్నారు. దాని ప్రస్తావనే వద్దని కిషోర్ సైగల ద్వారా బ్రతిమాలుకోవడం సభలో కొసమెరుపు.

# అఘోరాల మధ్య అఖండ 2 తాండవం



హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ పూర్తి చేసుకుని మరో సంచలనం కోసం అఖండ 2 తాండవం మొదలుపెట్టిన దర్శకుడు బోయపాటి శీను మహాకుంభమేళాకు వెళ్లి కోట్లాది మధ్య జనసందోహం మధ్య షూటింగ్ చేయడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ప్రయాగరాజ్ లో జరుగుతున్న ఈ అద్భుత ఉత్సవానికి సగటున రోజు యాభై లక్షలకు పైనే భక్తులు హాజరవుతున్నారు. అఘోరాల విన్యాసాలు, సన్యాసుల సమూహాలు, దేవతా మూర్తుల ఊరేగింపులు, భక్తుల ఆనంద పారవశ్యాలు చూసేందుకు రెండు కళ్ళు చాలవు. ఫిబ్రవరి 26 వరకు జరిగే కుంభమేళాకు మొత్తం దేశ జనాభాలో పాతిక శాతానికి పైగా పాల్గొంటారని ఒక అంచనా. అలాంటి చోట చిత్రీకరణ అంటే పెద్ద సవాలే. అయితే బోయపాటి బాలకృష్ణను తీసుకెళ్లి చేయలేదు. ఒక ముఖ్యమైన ఘట్టానికి సంబంధించిన ఫుటేజ్ తీసుకోవడంతో పాటు కొన్ని సన్నివేశాలు షూట్ చేశారని తెలిసింది. మళ్ళీ ఇంకోసారి వెళ్లే అవకాశం ఉంది. అఖండ 2 కథ మొత్తం పెద్ద బాలయ్య చుట్టే తిరగనుంది. లోక వినాశనానికి పూనుకున్న దుష్టశక్తులను అంతమొందించేందుకు అపారమైన దివ్య శక్తులను ప్రోగు చేసుకునే క్రమంలో చాలా కీలకమైన ఎపిసోడ్ ఈ బ్యాక్ డ్రాప్ లో ఉంటుందట. తెరమీద చూస్తే రోమాలు నిక్కబొడుచుకునే స్థాయిలో దీని తాలూకు సీన్లు ఉంటాయని తెలిసింది. సెప్టెంబర్ లో విడుదల ఫిక్స్ చేసుకున్న అఖండ 2 ఎలాంటి అవాంతరాలు లేకుండా అనుకున్న టైంకి రిలీజ్ చేసేలా బోయపాటి శీను పక్కా ప్లానింగ్ తో ఉన్నారు. డాకు మహారాజ్ రిలీజైపోయింది కాబట్టి బాలకృష్ణ పూర్తి డేట్లు దీనికే కేటాయించబోతున్నారు. సింహా, లెజెండ్, అఖండలతో ఒకదాన్ని మించి మరొకటి ఘనవిజయాలు అందుకున్న హీరో దర్శకుడి కాంబోగా ఈ ప్యాన్ ఇండియా మూవీ మీద మాములు అంచనాలు లేవు. తమన్ అయిదోసారి బాలయ్యకు ఛార్ట్ బస్టర్ బీజీఎమ్, పాటలు ఇచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ప్రగ్య జైస్వాల్ తో పాటు మొదటి భాగం తారాగణం ఇందులో భాగం కానుంది.

# రైతు జంగ్ సైరన్ లో పాల్గొన్న మణికొండ బీ.ఆర్.ఎస్ నాయకులు



గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 17 జనవరి 2025 తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సర్కార్ రైతులతో వ్యవహరిస్తున్న మోసపూరిత తీరుకు వ్యతిరేకంగా మరియు రైతు వ్యతిరేక ధోరణి తలపెట్టిన సర్కారుకు నిలతీతగా బీ.ఆర్.ఎస్ పార్టీ తలపెట్టిన చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ రైతుల పక్షాన చేస్తున్న దీక్షలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిలు మ్రోగించిన జంగ్ సైరన్ లో పాల్గొనే సందర్భముగా రాజేంద్రనగర్ ఇన్చార్జి, పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పిలుపు మేరకు అప్పా జంక్షన్ వద్ద



కలసి తగ్గేదెలా అని కథంతొక్కుతూ మణికొండ భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో నెక్నంపూర్ గవర్నమెంట్ పాఠశాల వద్ద ఏకీకృతమై కలసి కట్టుగా బయలు దేరేడం జరిగినదని, మార్గ మధ్యంలో కే.టీ.ఆర్ ను కలసి శాలువాలతో సన్మానం చేసిన మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగళ్ళ ధనరాజ్, రూపా రెడ్డి, గుట్టమీధి నరేందర్, అందె లక్ష్మణ్ రావు, ఉపేందర్నాథ్ రెడ్డి, గొరికంటి విఠల్, సంగం శ్రీకాంత్, మాల్యాద్రి నాయుడు, ఆరీఫ్ మొహమ్మద్, సుమనలిని, అన్షు, మంజు, రేఖ, అనూష, గీతా, హరి, తిరుపతి, రవి సాగర్, బుద్దోల్ బాబు, దిలీప్, భాను, శ్రీనివాస్ చారి తది తరులు గలరని మిగిలిన మణికొండ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నేరుగా షాబాద్ జంగ్ సైరన్ లోని కిక్కిరిసిన జన వాహినిలో చేరడం జరిగినది.

# భాజపా బూత్ కమిటీల ఎన్నిక సమావేశం



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 17:భారతీయ జనతా పార్టీ పట్టణ బూత్ కమిటీల ఎన్నిక సమావేశం శుక్రవారం శివాని స్కూల్ లో నిర్వహించారు.

ఈ సమావేశంలో మందమర్రి పట్టణ ఎన్నికల ఇన్చార్జి తమ్మినేడి శ్రీనివాస్ పాల్గొని పట్టణంలో ఉన్న బూతులను పరిశీలించి ఎన్నిక నియమకానికి బూతుల లిస్టులను తయారు చేశారు.

ఈ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి అధ్యక్షత వహించగా ఈసమావేశంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ కోలేటి శివ, మహిళా అధ్యక్షురాలు మల్యాల పార్వతి, కార్యదర్శి చిట్ల స్వప్న, సీనియర్ నాయకులు డి.వి దీక్షితులు, మల్యాల రాజమల్లు, రామటెంకీ దుర్గరాజ్, కట్ల తిరుపతి, బోడ్ల భూపతి, రామ్ కిష్టయ్య, రంగు శ్రీనివాస్, మెరుగు తిరుపతి, ములుమూరి రమేష్, వెంకటాచారి సిహెచ్, చెలిమెల చంద్రమౌళి, బూత్ అధ్యక్షురాల్లు బైరి రజిత, దోనుగు ప్రియాంక, మల్యాల లావణ్య, పైడిమల్ల అరుణ్, వంగల గణపతి, మొగిలి అంజయ్య, బొద్దున ఓం ప్రకాష్, సో%శీ%డ్ల అశోక్, దాసరి నర్సింగ్, గంట రజిత, సంకచర్ల ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు

# పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 17 : తమపై ఎలాంటి పోలీస్ కేసులు లేవు అని క్లియరెన్స్ నిమిత్తం కొంతమంది తప్పుడు అఫిడవిట్ లు సమర్పించడం జరుగుతుంది కావున అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని రామగుండం పోలీస్ కమిషనర్ సిఎం శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని వారు పాస్ పోర్ట్ కోసం, ఉద్యోగ నియామకాల కోసం, బయట దేశాలకు వెళ్లడం కోసం,తదితర కంపెనీ, సంస్థలు,పరిశ్రమలలో పనిచేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (%ూఎజ%) పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (%ూజజ%) కోసం దరఖాస్తు లు చేసుకొనే వారు కొంతమంది వారిపై గతంలో కేసులు నమోదు కాబడిన కూడా తమపై ఏలాంటి కేసులు లేవని పోలీస్ కేసుల క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్ లు సమర్పించడం జరుగుతుంది.రామగుండం కమీషనరేట్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు,సిబ్బంది వారి దరఖాస్తు ఆధారంగా విచారణ చేసినప్పుడు కొంతమంది పై కేసులు నమోదు కాబడినవి అని గుర్తించడం జరిగింది. గతంలో కూడా తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది.ఇప్పుడు తప్పుడు అఫిడవిట్ లు ఇచ్చిన సుమారు 20 మందిని స్పెషల్ బ్రాంచ్ వారు గుర్తించడం జరిగింది వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుంది.భవిష్యత్తు లో కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్,పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరు తప్పుడు అఫిడవిట్ సమర్పించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ హెచ్చరించారు. అఫిడవిట్ నోటరీ చేసే వాళ్ళు కూడా మీ దగ్గరకు అఫిడవిట్ కోసం వచ్చే వాళ్లకు కూడా తప్పుడు సమాచారంతో అఫిడవిట్ సమర్పిస్తే విచారణలో పోలీసు వారు గుర్తించడం ద్వారా కేసులు నమోదు కాబడతాయని తెలియజేయాలని సూచించారు.

## సంక్షేమ పథకాల పై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్షసంక్షేమ పథకాల పై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్ష

మేడ్చెల్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు.

శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట తహాసీల్దారు కార్యాలయంలో సంక్షేమ పథకాల పై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబరు ప్రకారం వ్యవసాయయోగ్యమైనదా, కాదా అనే స్పష్టతను గుర్తించి నివేదికలను తయారు చేయాలని సూచించారు. ఫైనల్ గా తహాసీల్దారు సమగ్ర నివేదికను పరిశీలించాలని తెలిపారు. గుట్టలు,రాళు ,, లే అవుట్లు, కాలేజీలు,గోడౌన్లు, పౌల్ట్రీ, ఇటిక బట్టీలు వంటి వాటిన వ్యవసాయేతరంగా చూపించాలన్నారు. గ్రామస్థాయిలో గ్రామ సభలు, మున్సిపాలిటీల స్థాయిలో వార్డు సభలను పక్కాగా నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. ఈ యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతనే వెల్లడించాలని తెలిపారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ ఉంటారని, ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయంతో పనిచేయాలని, అలాగే ప్రతి గ్రామ సభల్లో ఈ జాబితాను ప్రచురించాలని, చదివి వినిపించాలని, ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామ సభల్లో చర్చించి, ఆమోదించడం జరుగుతుందని సూచించారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే, వాటిని స్వీకరించి, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు) పథకంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. అందుకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ ఫార్మ్ లో కుటుంబాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, ఈ ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతే అమోదించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఒక రేషన్ కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలన్నారు. గ్రామీణంలో వార్షిక ఆదాయం రూ. 1.50 ఉండాలని, అర్బన్ లో రూ. రెండు లక్షలుగా ఉండాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇళ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్ లలో ఎటువంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు కేటాయించేందుకు గాను ఏఐ, జియో ట్యాగింగ్ ద్వారా డీడూప్లికేషన్ చేయాలని సూచించారు. అలాగే ఏమైనా పొరపాట్లు ఉంటే పీడీ హౌసింగ్ కు పంపించాలని, వివరాలను సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ కల్పించినట్లు వివరించారు.ఈ మొత్తం సంక్షేమ పథకాల ప్రక్రియలు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 12243 రేషన్ కార్డుల దరఖాస్తులు ఉన్నాయని జిల్లా కలెక్టరు గౌతం స్పెషల్ అధికారికి వివరించారు.

# బాధ్యులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరపండి

## -సినీ పాత్రికేయులు ప్రభు విజ్ఞప్తి




తన భార్య మరణానికి ముందు విడుదల చేసిన సూసైడ్ వీడియో ఆధారంగా బాధ్యులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరపాలని సినీ పాత్రికేయులు ప్రభు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూతురు స్పందనతో కలిసి మాట్లాడారు. తన భార్య దుర్గా మాధవి తల్లిదండ్రులతో ఉన్న ఆర్థిక పరమైన అంశాల నేపథ్యంలో తలెత్తిన మానసిక ఒత్తిడితో సూసైడ్ వీడియోను తీసుకొని తమ ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని అన్నారు. ఈ విషయమై తాము జనవరి 2 తారీఖున పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా జనవరి 4న దుర్గం చెరువులో మృతి చెందినట్లు పోలీసు ద్వారా తెలుసుకున్నమని చెప్పారు. పోలీసుల సమన్వయ లోపంతో తన భార్య మృతదేహం సుమారు మూడు రోజులపాటు అనాథ శవంలా ఉండిపోయిందని చెప్పారు. మానసిక ఒత్తిడికి గురైన తన భార్య సూసైడ్ వీడియోలో నలుగురు పేర్లను వివరిస్తూ వెళ్ళిపోయినని చెప్పారు. అనంతరం మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న తాము మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా దుర్గం చెరువులో ఎలా ఆత్మహత్యకు పాల్పడింది ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే అంశాలు ఇంకా ప్రశ్నలు గానే మిగిలిపోయాయని చెప్పారు. సంఘటన జరిగి 14 రోజులైనా ఇప్పటివరకు ఆమె ఆరోపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకోకపోవడం దుర్గం చెరువు చుట్టూ సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మాదాపూర్ పోలీసులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆమె సెల్ఫీ వీడియో ను మరణ వాంగ్మూలంగా భావించి సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

# ఆది జాంబవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

## -సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కంబాల, దాసరి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 17:ఆది జాంబవ సంఘం నూతన అధ్యక్షులుగా కంబాల రాజనర్సు, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాజనర్సు లను ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీదునూరి శంకర్, ఉపాధ్యక్షులుగా ఆవునూరి పోశం, బచ్చలి భీమయ్య, తుంగపిండి శ్రీనివాస్, కల్వల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా కల్వల పోషం, రామ్ బాబు, విరుగురాల వెంకటి, దాసరి ఎల్లారం, గసిగంటి మల్లయ్య, నాయిని శ్రీను, అధికార ప్రతినిధిగా ఉప్పులేటి నరేష్, ప్రచార కార్యదర్శులుగా సంఘీ రవి, రేగుంట రాజన్న, నెరువట్ల లక్ష్మణ్, ఏల్పుల దుర్గ ప్రసాద్, కాసిపేట సుధాకర్, గసిగంటి శంకర్, కోశాధికారిగా ఆసం కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా కల్వల సురేష్, కాసిపాక తిరుపతి, హనుమంతు, ఏల్పుల కిరణ్, ఎల్పుల వెంకటి, అంతర్పుల మధు లను ఎన్నుకున్నారు.

## కిలో గంజాయి పట్టివేత

### ఇద్దరి అరెస్టు ..రెండు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిదిముషిరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్ టి ఎఫ్ డి టీమ్ శుక్రవారం దాడులు నిర్వహించారు. దోమలగూడ దోభీగాట్ ప్రాంతంలో బైక్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా దాడి చేసి పట్టుకున్నారు. మౌలాలికి చెందిన కె .యశ్వంత్ , రామంతపూర్కు చెందిన సిహెచ్. వంశీ కృష్ణ వద్ద తనిఖీలు నిర్వహించగా వారి వద్ద గంజాయి లభించింది. గంజాయిని తూకం వేయగా 1.076కిలోలుగా ఉందని ఎస్ టి ఎఫ్ ఎస్సై జ్యోతి తెలిపారు. గంజాయితోపాటు నిందితుల వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లను , ఒక బైక్ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ముషిరాబాద్ స్టేషన్లో అప్పగించారు.గంజాయిని పట్టుకున్న టీమ్లో ఎస్సై జ్యోతితోపాటు కానిస్టేబుళ్లు లేఖాసింగ్, అలీమ్, కార్థిక్, చంద్రశేఖర్లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్ టి ఎఫ్ టీమ్ను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్రెడ్డి అభినందించారు.

# నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు మంత్రి తుమ్మల

## 30 కోట్లతో ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులు ,దశల వారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

## ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి తుమ్మల







**ఖమ్మం ప్రతినిధి జనవరి 17 (ప్రజాబలం)** ఖమ్మం నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ బల్లేపల్లి జయనగర్ కాలనీలో ఎల్.ఆర్.ఎస్. నిధులు 2 కోట్లతో చేపట్టిన సైడ్ డ్రైన్ నిర్మాణం, ఖమ్మం ఇల్లందు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఎస్సి కాలని చర్చి వరకు జయనగర్ కాలనిలో రోడ్డు పురోగతి పనులు, టి.యు.ఎఫ్.ఐ.డి.సి.నిధులు ఒక కోటి 25 లక్షలతో 3 వ డివిజన్ నందు సి.సి.రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో దివంగత కార్పొరేటర్ జగన్ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన డివిజన్ లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు గతంలో ఖానాపురం, బల్లెపల్లి బాలాపేట్ నుంచి ఖమ్మం పట్టణంలో వచ్చిన వరద నివారణకు 200 కోట్లతో సర్ ప్లస్ నీరు ధంసలాపురం మీదుగా మళ్ళీ మున్నేరు వెళ్ళే విధంగా కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు ప్రణాళికలు చేపట్టామని, ఈ రోజు వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు 3 కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్ వే ద్వారా సందర్శకులు వెళ్లేందుకు, పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు 30 కోట్లతో పనులు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనవరి 26 నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని అన్నారు. మొదటి దశలో అత్యంత పేదలకు ప్రభుత్వ సహాయం అందుతుందని, తరువాత దశలవారీగా అర్హులందరికీ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని, ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉగాది నుండి రేషన్ కార్డుల క్రింద సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మన జిల్లాలో లక్ష టన్నులు అధికంగా ధాన్యం సేకరణ జరిగిందని అన్నారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందించామని అన్నారు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, నూతన వైద్య కళాశాల జిల్లాకు రావడంతో పాటు జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే మన పి.హెచ్.సి. లు, ఏరియా ఆసుపత్రిలను మంత్రి చొరవ వల్ల అభివృద్ధి చేసుకుంటూ పోతున్నామని అన్నారు విద్యా రంగంలో మన పిల్లలు అద్భుతంగా ఎదగాలనే ఆకాంక్షతో జిల్లాలో 60 ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు ప్రవేశ పెట్టామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన మౌళిక వసతులు కల్పించుకుంటూ పోతున్నామని అన్నారు. జిల్లాలో 575 కోట్ల రూపాయలతో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 160 కోట్ల బోనస్ ఇచ్చామని అన్నారు. భక్త రామదాసు, నాగార్జున సాగర్, ఇతర ఎత్తిపోతల పథకాల క్రింద సాగు సజావుగా అందేలా చర్యలు చేపట్టామని అన్నారు ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు ఆర్థిక అండ్ బి ఈ ఈ యుగంధర రావు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

## జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక

## జిల్లా కలెక్టరు గౌతం






**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి జనవరి 17:**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు.

శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట తహాసిల్దారు కార్యాలయంలో సంక్షేమ పథకాల పై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబరు ప్రకారం వ్యవసాయయోగ్యమైనదా, కాదా అనే స్పష్టతను గుర్తించి నివేదికలను తయారు చేయాలని సూచించారు. ఫైనల్ గా తహాసీల్దారు సమగ్ర నివేదికను పరిశీలించాలని తెలిపారు. గుట్టలు,రాళ్లు, లే అవుట్లు, కాలేజీలు,గోడౌన్లు, పౌల్ట్రీ, ఇటిక బట్టిలు వంటి వాటిన వ్యవసాయేతరంగా చూపించాలన్నారు. గ్రామస్థాయిలో గ్రామ సభలు, మున్సిపాలిటీల స్థాయిలో వార్డు సభలను పక్కాగా నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. ఈ యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని, ఈ జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతనే వెల్లడించాలని తెలిపారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబానికి రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 నగదు సాయం అందించనున్న నేపథ్యంలో 2023-24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని దినాలు పూర్తిచేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రస్థాయి నుంచి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఎంపిడిఓ ఉంటారని, ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయంతో పనిచేయాలని, అలాగే ప్రతి గ్రామ సభల్లో ఈ జాబితాను ప్రచురించాలని, చదివి వినిపించాలని, ఎలాంటి అపోహలు తలెత్తకుండా గ్రామ సభల్లో చర్చించి, ఆమోదించడం జరుగుతుందని సూచించారు. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు గ్రామ సభల్లో వస్తే, వాటిని స్వీకరించి, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు) పథకంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. అందుకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ ఫార్మ్ లో కుటుంబాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసి, ఈ ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, చర్చించిన తర్వాతే అమోదించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఒక రేషన్ కార్డు ఒక వ్యక్తికి ఒకే చోట ఉండాలన్నారు. గ్రామీణంలో వార్షిక ఆదాయం రూ. 1.50 ఉండాలని, అర్బన్ లో రూ. రెండు లక్షలుగా ఉండాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాలు, ఇళ్లు లేనివారు, పూరిగుడిసెలు ఉన్నవారు, అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారు, నిర్మాణానికి స్థలం ఉన్నవారు అర్హులను తెలిపారు. ఇందులో భాగంగా మట్టి గోడలు, పైకప్పు లేని గృహాలు, వితంతువులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్ లాగిన్ లలో ఎటువంటి లోపాలు దొర్లకుండా సూపర్ చెక్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు కేటాయించేందుకు గాను ఏఐ, జియో ట్యాగింగ్ ద్వారా డీడూప్లికేషన్ చేయాలని సూచించారు. అలాగే ఏమైనా పొరపాట్లు ఉంటే పీడీ హౌసింగ్ కు పంపించాలని, వివరాలను సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ కల్పించినట్లు వివరించారు. ఈ మొత్తం సంక్షేమ పథకాల ప్రక్రియలు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 12243 రేషన్ కార్డుల దరఖాస్తులు ఉన్నాయని జిల్లా కలెక్టరు గౌతం స్పెషల్ అధికారికి వివరించారు.

అనంతరం శామీర్ పేట మండలంలోని ఆలియాబాదులో స్పెషల్ ఆఫీసర్ శశాంక ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారు పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి తూంకుంటకు వెళ్లి అక్కడ నిర్వహిస్తున్నరేషన్ కార్డుల సర్వేను పరిశీలించి సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను అందజేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి,శామీర్ పేట్ తహాసీల్దారు యాదగిరి, డిఆర్ డిఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరా అధాకారి సుగుణబాయి, హౌజింగ్ పిడి రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, ఎంపిడిఓ సుగుణ బాయి, తదితరులు పాల్గొన్నారు.





## అల్వాల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవల పునఃప్రారంభం

## జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి

**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ జనవరి 17:**జిల్లా అభివృద్ధి, సమన్వయం మరియు మానిటరింగ్ కమిటీ సమావేశంలో జరిగిన చర్చల ప్రకారం అందించిన సూచనల మేరకు జిహెచ్ఎంసి హాల్, వెంకటాపూర్ లో ప్రస్తుతము పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే పిల్లలు, గర్భిణీలు, మరియు వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం చర్యలు తీసుకుంది.అల్వాల్ లో నూతనంగా నిర్మించిన భవనంలో వైద్య సేవలను పునఃప్రారంభించి, రోగులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి

డా. టి. రఘునాథ్ స్వామి ప్రకటించారు.ఇక్కడ పిల్లలు, గర్భిణీలు, మరియు వృద్ధులకు మరియు సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సేవలను సౌకర్యవంతమైన విధానంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు అని పేర్కొన్నారు .జిల్లా వైద్య మరియు ఆరోగ్య కార్యాలయం ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నది మరియు అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని ప్రజలను అభ్యర్థించారు.

## సీఎంపీఎఫ్ 183వ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశం

సింగరేణి భవన్, జనవరి 17, 2025కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్వో) 183వ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశంలో శుక్రవారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో జరిగింది. కేంద్ర బొగ్గు మంత్రి త్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పింఛన్దారుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. తొలిసారిగా హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఎంపీఎఫ్ అధికారులు, బొగ్గు కంపెనీల ప్రతినిధులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం సీఎంపీఎఫ్ ద్వారా సేవల అందిస్తున్న విషయాన్ని బొగ్గు మంత్రి త్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ గుర్తుచేశారు. ఈ పింఛన్ సేవలను మరింత మెరుగు పరచడంతోపాటు, కార్మికులకు పింఛన్ భద్రతను కల్పించడంపై విస్తృతంగా చర్చించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com